విశాఖపట్టణం
గురువారం 19 ఫిబ్రవరి 2026

For a pure tomorrow..

జయ జయహే

jayajayahey.in సంపుటి: 9 సంచిక: 26 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

**విశాఖపట్నం, ఫిబ్రవరి 18, జయ జయహే**



భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రెండు రోజుల పర్యటన ముగిసింది. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూకు మంగళవారం వచ్చిన ఆమె బుధవారం ఆ కార్యక్రమం అనంతరం నేవెల్ ఎయిర్ స్టేషన్ నుంచి బయలుదేరారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్, జిల్లా ఇంచార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖ బ్రత బాగ్చి తదితరులు రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.



## ఫ్లైట్, మ్యాచ్.. టికెట్ల ఖర్చు నాదే

**నా దుడ్లతోనే మ్యాచ్ చూసి వస్తిని**

**నీ దుడ్డు ఏమైనా ఖర్చు చేస్తినా**

**ప్రజాధనం ఎక్కడా ఖర్చు చేయలేదు**

**మంత్రి నారా లోకేశ్ స్పష్టీకరణ**

**కొలంబో క్రికెట్ మ్యాచ్‌పై వైసీపీకి కౌంటర్**

**(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)**

సీఎంలు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులు పలు ప్రాంతాల్లో పర్యటిస్తుంటారు. కొన్ని ప్రభుత్వ కార్యక్రమాలు, కొన్ని వ్యక్తిగత ఈవెంట్లు, పనులకు సైతం వెళ్తుంటారు. ఆ సమయలో వారు చేసే ప్రయాణాల ఖర్చులపై వివాదం నడుస్తుంది. ప్రజాధనం వృథా చేస్తున్నారని, అప్పనంగా ప్రజల సొమ్ము వాడేస్తున్నారని.. అవసరం లేకున్నా విమానాల్లో,

..మిగతా 2లో

# అంతర్జాతీయ స్నేహ సంబంధాలకు ప్రతీక ఐఎఫ్ఆర్

**ఇది శక్తి ప్రదర్శన మాత్రమే కాదు**

**ఐ ఎఫ్ ఆర్ లో పాల్గోవడం గర్వంతో పాటు ఆనందాన్నిస్తోంది**

**సురక్షిత సముద్రం-సమృద్ధి భారత్ లక్ష్యమే నౌకాదళం**

**ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము**





**జయ జయహే బ్యూరో - విశాఖపట్నం**

ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ అంటే కేవలం శక్తి ప్రదర్శన మాత్రమే కాదని, ఇది అంతర్జాతీయ స్నేహ బంధాలకు ప్రతీక అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మహా విశాఖలో బుధవారం ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ ముగిసిన అనంతరం ఆమె ప్రసంగించారు. విశాఖ అనే సముద్ర తీర మహా నగరంలో ఈ గౌరవప్రదమైన ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో పాల్గొనడం నాకు

..మిగతా 2లో

## రక్షణలో నేవీ కీలకం

**సముద్ర వాణిజ్యంలో సుస్థిరత**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి**

**ఐఎన్ ఎస్ సుమేధ నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ**

8

# కూటమిని కూల్చే వరకు పోరాటం ఆగదు

**జైలులో పెడితే భయపడతా అనుకున్నారు**

**నా పట్టుదలకు శిక్షణగా మారింది**

**ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటా**

**మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలు**

**సంక్రాంతి లక్కీడ్రా కేసులో బెయిల్**



**(రాజమహేంద్రవరం - జయజయహే)**

వైసీపీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు సుమారు 19 రోజుల జైలు జీవితం తర్వాత బుధవారం సాయంత్రం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలయ్యారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసుతో పాటు, పోలీసుల విధులకు ఆటంకం కలిగించడం, 2023లో సత్తెనపల్లిలో సంక్రాంతి లక్కీ డ్రా పేరిట అక్రమ వసూళ్లకు పాల్పడ్డారన్న కేసుల్లో ఆయనపై పీటీ వారెంట్లు జారీ అయ్యాయి. వరుసగా ఈ మూడు కేసుల్లోనూ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేయడంతో ఆయన విడుదలకు మార్గం సుగమమైంది. జైలు నుంచి బయటకు రాగానే అంబటి రాంబాబుకు వైసీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. తనను జైలు నుంచి బయటకు రానివ్వకుండా అడ్డుకోవడానికి ప్రభుత్వం శతవిధాలా ప్రయత్నించిందని, వరుస కేసులు పెట్టి

..మిగతా 2లో



## రూ.37, 899 కోట్ల పెట్టుబడులకు ఓకే

**ఐటీ, విద్యుత్, టూరిజం ఫుడ్ రంగాల్లో ఇన్వెస్ట్మెంట్లు**

**ఆమోదం తెలిపిన ఎస్ఐపీబీ**

**(అమరావతి - జయజయహే)**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో ఉండవల్లి క్యాపు కార్యాలయంలో బుధవారం 15వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై సీఎం చర్చించారు. ప్రధానంగా వివిధ రంగాలకు చెందిన కంపెనీల పెట్టుబడులపై

..మిగతా 2లో



## రాజ్యసభకు మోగిన నగారా

**10 రాష్ట్రాల్లో 37 స్థానాలకు షెడ్యూల్**

**మార్చి 16న పోలింగ్**

**(న్యూఢిల్లీ - ప్రత్యేక ప్రతినిధి)**

రాజ్యసభ ఎన్నికలకు నగారా మోగింది. త్వరలో ఖాళీ కానున్న రాజ్యసభ స్థానాలకు షెడ్యూల్ బుధవారం విడుదల అయింది. తెలంగాణ నుంచి 2 రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. మొత్తం 10 రాష్ట్రాల్లో ఖాళీ కాబోతున్న రాజ్యసభ స్థానాలకు త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 26న ఈ రాజ్యసభ ఖాళీ కానున్న స్థానాలకు నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. మార్చి 16న పోలింగ్ నిర్వహించనున్నట్లు భారత ఎన్నికల సంఘం వెల్లడించింది. పది రాష్ట్రాల్లో మొత్తం 37 రాజ్యసభ

..మిగతా 2లో

## భారత్ గిన్నిస్ వరల్డ్ రికార్డు

**24 గంటల్లో 2.5లక్షల ఏఐ ప్రతిజ్ఞలు**

**ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026- ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్- బాధ్యతాయుత కృత్రిమ మేధపై లక్షలాది మంది ప్రతిజ్ఞ**




**ప్రత్యేక ప్రతినిధి, జయజయహే:**

దిల్లీలో ప్రతిష్ఠాత్మక ఏఐ సదస్సు జరుగుతున్న వేళ భారత్ గిన్నిస్ వరల్డ్ రికార్డును సాధించింది. ఈ సదస్సు సందర్భంగా 24 గంటల్లోనే (ఫిబ్రవరి 16 -17) అత్యధికంగా 2,50,946 మంది ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞలు చేయడంతో భారత్ పేరు గిన్నిస్ వరల్డ్ రికార్డు పుటల్లోకి ఎక్కింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీని బాధ్యతాయుతంగా వినియోగిస్తామంటూ అతిస్వల్ప వ్యవధిలో ఇంత పెద్ద సంఖ్యలో ప్రజలు ప్రతిజ్ఞలు చేయడం విశేషం. దిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరుగుతున్న భారత్ మండపం వేదికగా ఈవివరాలను కేంద్ర ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ బుధవారం వెల్లడించారు. ఏఐ ఇంపాక్ట్ సదస్సు సాక్షిగా దేశవ్యాప్తంగా 2.50 లక్షల మందికిపైగా భారతీయులు ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞలు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ రికార్డును



## చెరువులో డెడ్ బాడీ

**ఆత్మహత్య చేసుకున్న కులవర్ధన్**

**పోలీసుల నుంచి తప్పించుకున్నవైనం**

**తర్వాత కనసానివారిపల్లె చెరువులో మృతదేహం**

**ఏడేళ్ల బాలికను హత్యాచార ఘటనలో నిందితుడు**

2

For a pure tomorrow.. జయహో

# అంతర్జాతీయ స్నేహ సంబంధాలకు ప్రతీక ఐఎఫ్ఆర్





**మొదటి పేజీ తరువాయి...**

అపారమైన గర్వాన్ని, ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ దేశం ఒక సముద్ర వారసత్వం కలిగిన దేశమని, శతాబ్దాలుగా మన సముద్ర మార్గాలు వాణిజ్యానికి, సంస్కృతి, భద్రతకు ప్రధాన ఆధారంగా నిలుస్తున్నాయన్నారు. ఈ రోజు మన ముందున్న ఈ విశాల నౌకాదళ విన్యాసం భారత నౌకాదళ శక్తి, సాంకేతిక నైపుణ్యం, క్రమశిక్షణకు ప్రతీకగా నిలుస్తోందన్నారు. భారత నౌకాదళం దేశ సార్వభౌమాధికారాన్ని కాపాడడమే కాకుండా సముద్ర మార్గాల భద్రత, మానవతా సహాయ కార్యక్రమాలు, విపత్తు సహాయక చర్యల్లోనూ ..మిగతా 2లో

కీలక పాత్ర పోషిస్తోందని వెల్లడించారు. సురక్షిత సముద్రం-సమృద్ధి భారత్ అనే లక్ష్యంతో మన నౌకాదళం నిరంతరం కృషి చేస్తోందని చెప్పారు. వివిధ దేశాల నౌకాదళాలు ఐ ఎఫ్ ఆర్ లో పాల్గొనడం ద్వారా "వసుధైవ కుటుంబం" అనే భారతీయ తత్వాన్ని మనం ఆచరణలో చూపిస్తున్నామని పేర్కొన్నారు. సముద్ర భద్రత, ఉగ్రవాద నిరోధం, సముద్ర దోపిడీ నియంత్రణ వంటి అంశాలలో అంతర్జాతీయ సహకారం అత్యవసరమని, మన యువతకు, ముఖ్యంగా విశాఖపట్నం వంటి తీరప్రాంతాల్లో పెరుగుతున్న విద్యార్థులకు, భారత నౌకాదళం స్ఫూర్తిదాయకంగా అభివర్ణించారు. క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం ఉ ఇవే మన నావికుల విశేష లక్షణాలని, ఈ సందర్భంగా దేశ సేవలో అహర్నిశలు కష్టపడుతున్న ప్రతి నౌకాదళ సిబ్బందికి నా హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానని, వారి కుటుంబాలకు కూడా నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. భారతదేశ సముద్ర శక్తి మరింత బలోపేతం కావాలని, ప్రపంచ శాంతి, భద్రత, సహకారం కోసం మన దేశం ముందంజలో నిలవాలని ఆశిస్తూ నా ప్రసంగాన్ని ముగిస్తున్నానన్నారు. ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూలో వివిధ దేశాలకు చెందిన 71 యుద్ధ నౌకల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు నేవల్ అధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫ్లైట్, మ్యాచ్.. టికెట్ల ఖర్చు నాదే

**మొదటి పేజీ తరువాయి...**



హెలికాప్టర్లో పర్యటనలకు వెళ్లి డబ్బులు తగలేస్తున్నారని ప్రతిపక్షాలు విమర్శిస్తుంటాయి. తాజాగా అలాంటి ఘటనలో మంత్రి నారా లోకేష్ పై మాజీ సీఎం వైఎస్ జగన్ కు చెందిన వైఎస్సార్ సీపీ నేతలు విమర్శలు చేశారు. ఆ విమర్శలకు నారా లోకేష్ పుష్ప సినిమా స్టైల్లో డైలాగ్ ను గుర్తుచేస్తూ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శ్రీలంకలోని కొలంబో వేదికగా జరిగిన భారత్, పాకిస్తాన్ మ్యాచ్ చూసేందుకు ప్రజాధనం వృథా చేశాడని వైసీపీ విమర్శలు చేసింది. వారి అనుకూల మీడియాలోనూ దీనిపై కథనం ప్రసారం చేసింది. కొలంబోలో జరిగిన భారత్, పాక్ క్రికెట్ మ్యాచ్ కి ప్రజల సొమ్ముతో విమాన టికెట్లు, మ్యాచ్ టికెట్లు కొని జల్సాలు చేశారని లోకేష్ పై విమర్శలు గుప్పించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తూ.. మంత్రి నారా లోకేష్ ప్రభుత్వ ధనం వెచ్చించి వెళ్లారనే వార్త లో ఎలాంటి వాస్తవం లేదని ఏపీ ఫ్యాక్ట్ చెక్ తెలిపింది. మంత్రి లోకేష్ పర్యటన కోసం ప్రభుత్వ ధనం ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ఇలాంటి అసత్య వార్తలు నమ్మవద్దు అని సోషల్ మీడియా ఖాతాల్లో స్పష్టం చేసింది.

**పుష్ప స్టైల్లో కౌంటర్..**

భారత్, పాక్ మ్యాచ్ చూసేందుకు తాను ప్రజా ధనాన్ని వృథా చేసి ఎంజాయ్ చేశానన్న విమర్శలపై మంత్రి నారా లోకేష్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. ప్రతి పైసా తనవేనని, ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి తీసుకోలేదన్నారు. ఫ్లైట్ టికెట్టూ నాదే.. మ్యాచ్ టికెట్టు కూడా నాదే.. నా దుడ్లతో నేను మ్యాచ్ చూస్తిని. నీ దుడ్లు ఏమైనా ఖర్చు చేస్తినా జగన్ అని కౌంటర్ ఇవ్వగా వైరల్ అవుతోంది. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ప్రజాధనంతో విమానాల్లో షికార్లు చేస్తుంటారని, ప్రజల డబ్బును సొంత పనులను వాడుకుంటారని వైసీపీ నేతలు పదే పదే విమర్శిస్తుంటారు. అయితే ప్రజా ధనం ఎక్కడా వృథా చేయలేదని గతంలో పలుమార్లు ఆరోపణలు, విమర్శలకు కూటమి నేతలు క్లారిటీ ఇచ్చారు. తాజాగా తనపై విమర్శలు రావడంతో లోకేష్ అందులో నిజం లేదన్నారు.




# రాజ్యసభకు మోగిన నగారా

**మొదటి పేజీ తరువాయి...**

ఎంపీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రక్రియ మొదలైంది. ఏప్రిల్ 9కి తెలంగాణ నుంచి కేఆర్ సురేశ్‌రెడ్డి, అభిషేక్ సింఘ్వీల రాజ్యసభ పదవీ కాలం పూర్తి కానుంది. తమిళనాడులో ఆరుగురు, బెంగాల్‌లో అయిదుగురు, బిహార్‌లో అయిదుగురు, ఒడిశాలో నలుగురు, అస్సాంలో ముగ్గురు, చత్తీస్‌ఘడ్, హర్యానాల్లో ఇద్దరేసి, హిమాచల్ ప్రదేశ్‌లో ఒక రాజ్యసభ సీటు ఖాళీ కాబోతున్నాయి. రాజ్యసభ నిరంతర సభ కాగా, అందులో 37 మంది సభ్యుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగియనుందని తెలిసిందే. ఈ ఖాళీల భర్తీకి సంబంధించి ఈసీ షెడ్యూల్ విడుదల చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ ఫిబ్రవరి 26న ఈసీ విడుదల చేయనుంది. మార్చి 5 వరకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం కల్పించారు. మార్చి 9వ వరకు దరఖాస్తులు విత్‌డ్రా చేసుకునే వీలుంటుంది. షెడ్యూల్ ప్రకారం మార్చి 16వ తేదీన ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకు ఓటింగ్ నిర్వహిస్తారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఓట్ల లెక్కింపు చేపట్టి ప్రక్రియ విజేతను ప్రకటిస్తారు.



# భారత్ గిన్నిస్ వరల్డ్ రికార్డు

**మొదటి పేజీ తరువాయి...**

గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ న్యాయనిర్ణేత ప్రవీణ్ పటేల్ అధికారికంగా ధ్రువీకరించారు.

**ప్రతిజ్ఞలన్నీ అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు**

ఇండియా ఏఐ మిషన్‌లో భాగంగా దేశవ్యాప్తంగా ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞల కార్యక్రమాన్ని నిర్వహించామని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఇంటెల్ ఇండియా కంపెనీతో కలిసి ఫిబ్రవరి 16న ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టామని ఆయన చెప్పారు. ఇందులో భాగంగా నైతికంగా, సమ్మిళితంగా, బాధ్యతాయుతంగా ఏఐ టెక్నాలజీని వినియోగిస్తామనే ప్రతిజ్ఞను లక్షలాది మంది భారతీయులు చేశారన్నారు. ఈ ప్రతిజ్ఞలన్నీ ఏఐ ప్లెడ్జ్ ఇండియా అధికారిక వెబ్‌సైట్ లో నమోదయ్యాయని పేర్కొన్నారు. డేటా ప్రైవసీ, బాధ్యతాయుత వ్యవహార శైలి, పారదర్శకత, సందర్భోచిత ప్రశ్నలను అడగడం ద్వారా తప్పుడు సమాచారంపై పోరాటం చేయడం, విశ్వసనీయ, మానవ కేంద్రిత ఏఐ వ్యవస్థను అందుబాటులోకి తేవాలనే భారతదేశ విజన్‌కు అండగా నిలవడం వంటి అంశాలపై ప్రజలతో ప్రతిజ్ఞలు చేయించారని తెలిపారు. ఈ ప్రతిజ్ఞలు చేసిన వారందరికీ డిజిటల్ బ్యాడ్జీలను, ఏఐ స్కిల్స్ లెర్నింగ్ కోర్సులను మంజూరు చేశారని చెప్పారు.

**మోదీ విజన్**

"ప్రధాని మోదీ విజన్‌లో భాగంగానే ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞల కార్యక్రమాన్ని నిర్వహించాం. ఇందులో భాగంగా కాలేజీలు, బోధనా సిబ్బంది, విద్యార్థుల దాకా మేం చేరాం. వారందరితో ప్రతిజ్ఞలు చేయించాం. ఏఐ టూల్స్‌ను సమాజ శ్రేయస్సు కోసమే వినియోగిస్తామంటూ అందరూ ప్రతిజ్ఞలు చేశారు. టెక్నాలజీ మన జీవితాలను మెరుగుపర్చాలని ప్రధాని మోదీ కోరుకుంటున్నారు. అయితే దాన్ని బాధ్యతాయుతంగా వాడాల్సిన బాధ్యత మనపైనే ఉంది. ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞలు చేసిన వాళ్లను ప్రతి ఒక్కరు అభినందించాలి. ఇది మనదేశం గర్వించే విషయం. ఏఐను బాధ్యతాయుతంగా వినియోగించేందుకు ఇండియా సిద్ధమైంది" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ పేర్కొన్నారు.

**'5వేల మందితోనే ప్రతిజ్ఞలు చేయించాలనుకున్నాం'**

"5వేల మందితో ఏఐ రెస్పాన్సిబిలిటీ ప్రతిజ్ఞలను చేయించాలని తొలుత మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. కానీ ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. దీంతో ప్రతిజ్ఞలు చేసిన వారి సంఖ్య లక్షలకు చేరింది. మన దేశ ప్రజలకు ఏఐపై పెరుగుతున్న అవగాహనకు ఇదొక నిదర్శనం" అని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

**అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**

దేశ పౌరుల కోసం ఏఐ టూల్స్‌ను అభివృద్ధి చేసేందుకు అమెరికా ఆవిష్కరణలను భారత్ ఉపయోగించుకోవచ్చని వైట్‌హౌస్ ఏఐ పాలసీ అడ్వైజర్ శ్రీరామ్ క్రిష్ణన్ అన్నారు. ఈ విషయంలో భారత్‌తో కలిసి పనిచేసేందుకు అమెరికా చొరవ చూపాల్సిన అవసరం ఉందన్నారు.

ఏఐ, సెమీ కండక్టర్ల విభాగాల్లో అంతర్జాతీయ సప్లై చైన్లను దక్కించుకునేందుకు భారత్‌ను కీలక భాగస్వామిగా అమెరికా పరిగణిస్తోందని ఆయన పేర్కొన్నారు. దిల్లీలో జరుగుతున్న ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు శ్రీరామ్ క్రిష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఓ సెషన్‌లో ప్రసంగిస్తూ పైవ్యాఖ్యలు చేశారు. ఏఐ టూల్స్ సమాచారాన్ని క్లాస్‌రూంల వరకు తీసుకెళ్లేలా భారత్‌లో ఎడ్యుకేషన్ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఆరోగ్య సంరక్షణ విభాగంలోనూ ఏఐను వినియోగించొచ్చు అన్నారు. ఏఐ విభాగంలోని టాప్ కంపెనీలన్నీ అమెరికాలోనే ఉన్నాయని, వాటిలో భారీ పెట్టుబడులను పెట్టారని శ్రీరామ్ క్రిష్ణన్ తెలిపారు. ఈ పెట్టుబడుల ఫలితంగా రాబోయే కొన్ని నెలల్లో అధునాతన జీపీయూలు, ఏఐ చిప్‌లు, టీపీయూలు అందుబాటులోకి వస్తాయన్నారు. వీటన్నింటిని భారత ప్రజల జీవన నాణ్యతను పెంచేందుకు ఉపయోగించాలని పేర్కొన్నారు.



# రూ.37, 899 కోట్ల పెట్టుబడులకు ఓకే

**మొదటి పేజీ తరువాయి...**

మాట్లాడారు. మొత్తం రూ. 37, 899 కోట్ల పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. ఈ పెట్టుబడుల ద్వారా 56,692 మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల రంగాలకు చెందిన వివిధ పెట్టుబడి ప్రతిపాదనలకు ఎస్ఐపీబీలో ఆమోదం తెలిపారు. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, వాసంశెట్టి సుభాశ్, సీఎస్ కె.విజయానంద్, వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# కూటమిని కూల్చే వరకు పోరాటం ఆగదు

**మొదటి పేజీ తరువాయి...**

వేధించిందని ఆరోపించారు. నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని అనుకున్నారు, కానీ రాజమండ్రి జైలు నా పట్టుదలకు శిక్షణగా మారింది అంటూ వ్యాఖ్యానించారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అక్రమ కేసులు బనాయించారని, తన ఇంటిపై దాడులు చేసి తన భార్య, పిల్లలను ఇబ్బందులకు గురిచేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులను జైలులో పెట్టి, నేరస్తులను బయట తిరగనిస్తున్నారని విమర్శించారు. ప్రజలు, ధర్మం నా వెంటే ఉన్నాయి.. పైన దేవుడున్నాడు, అన్నింటికీ ఒకరోజు సమాధానం చెబుతాను అని ఆయన పేర్కొన్నారు. ఎన్ని కేసులు పెట్టినా, ఎలాంటి పరిస్థితులు ఎదురైనా ప్రజాక్షేత్రంలో పోరాటం ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కూటమి ని కూల్చేంత వరకూ పోరాడతానని అన్నారు. జనవరి 31న అరెస్ట్ అయిన అంబటి, తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో జైలుకు వెళ్లడం ఇదే తొలిసారి. ఆయన జైలులో ఉన్న సమయంలో పలువురు పార్టీ నేతలు పరామర్శించారు. విడుదల అనంతరం ఆయన భారీ ర్యాలీగా బయలుదేరారు. గురువారం ఆయన వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో భేటీ అయ్యే అవకాశం ఉంది.



# చెరువులో డెడ్ బాడీ

**ఆత్మహత్య చేసుకున్న కులవర్ధన్**

**పోలీసుల నుంచి తప్పించుకున్నవైనం**

**తర్వాత కనసానివారిపల్లె చెరువులో మృతదేహం**

**ఏడేళ్ల బాలికను హత్యాచార ఘటనలో నిందితుడు**

**(అన్నమయ్య జిల్లా - జయజయహే)**

తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన అన్నమయ్య జిల్లా మదనపల్లె బాలిక హత్యాచారం కేసు నిందితుడు కులవర్ధన్ మృతి చెందాడు. కరంబలకోట మండలం కనసానివారిపల్లె చెరువులో అతని మృతదేహం కనిపించింది. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు డెడ్‌బాడీని మదనపల్లెకు తరలిస్తున్నారు. నిన్న హత్యాచారం అనంతరం నిందితుడు పరారైనట్టు పోలీసులు చెప్పారు. ఈ క్రమంలోనే కులవర్ధన్ ఆత్మహత్య చేసుకున్నట్టు అనుమానిస్తున్నారు. అటు నీరుగట్టువారిపల్లిలోని కులవర్ధన్ ఇంటి దగ్గర పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అటు మరికాసేపట్లో హత్యకు గురైన చిన్నారి డెడ్ బాడీకి అంత్యక్రియలు జరగనున్నారు. స్వగ్రామం వీరబల్లి మండలంలో అంత్యక్రియలు చేయనున్నారు. ఇదిలా ఉంటే.. అన్నమయ్య జిల్లా మదనపల్లిలో నిన్న అదృశ్యమైన ఏడేళ్ల బాలిక శవంగా కనిపించిన సంగతి తెలిసిందే. మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించగా.. ఇంటికి సమీపంలోనే బాలిక ఓ డ్రమ్ములో శవమై కనిపించింది. కులవర్ధన్ అనే వ్యక్తిని అనుమానించారు పోలీసులు. ఈ కులవర్ధన్ బాలిక ఇంటి సమీపంలోనే నివాసం ఉంటున్నాడు. అత్యాచారం చేసి.. ఆపై హత్య చేసి డ్రమ్ములో కుక్కి చంపినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ క్రమంలోనే పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టగా.. అతడి డెడ్ బాడీ ఈ ఉదయం చెరువులో దొరికింది.

# పేద విద్యార్థుల భవిష్యత్తుపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం

## వైస్సార్సీపీ ఎంబీసి విభాగం రాష్ట్ర అధ్యక్షులు పెండ్ర వీరన్న

**భీమవరం (జయ జయహే)**

విల వైస్సార్సీపీ ఎంబీసీ విభాగం రాష్ట్ర అధ్యక్షులు, వైసిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్,మరియు ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పెండ్ర వీరన్న పత్రిక సమావేశం లో మాట్లాడుతు పేదవాడి ఏకైక ఆయుధం విద్యేనని "ఈ దేశంలో పేదరికం అనే సంకెళ్లను తెంచుకోవడానికి పేదవాడి దగ్గర ఉన్న ఏకైక ఆయుధం చదువు. ఆ ఆశతోనే రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబాల పిల్లలు, తమ జీవితాలు మారతాయని ఆశగా కాలేజీల గడప తొక్కారన్నారు. కానీ నేడు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరి వల్ల ఆ విద్యావంతుల భవిష్యత్తు చీకటమయం అవుతుందని. విద్యార్థుల కలలు కలలూగానే మిగిలిపోతున్నాయని ఆయన అన్నారు, ప్రస్తుతం రాష్ట్రంలో విద్యా వ్యవస్థ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందకపోవడం వల్ల విద్యార్థులు అగచాట్లుపడుతున్నారు అని, ఫీజు బకాయిలు ఉన్నాయనే సాకుతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వడం లేదని,కష్టపడి చదివిన విద్యార్థులను పరీక్షా హాల్లోకి అనుమతించకుండా మానసిక క్షోభకు గురిచేస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు, కోర్సు పూర్తయిన. వారికి సర్టిఫికెట్లు ఇవ్వకుండా కాలేజీలు నిలిపివేస్తున్నాయి. దీనివల్ల పైచదువులకు వెళ్లలేక, ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోలేక యువత రోడ్డున పడుతున్నారని పెండ్ర వీరన్న అన్నారు,



ప్రభుత్వ సాయం వస్తుందని నమ్మి పిల్లలను చేర్పిస్తే, ఇప్పుడు యాజమాన్యాల ఒత్తిడి తట్టుకోలేక పేద తల్లిదండ్రులు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఫీజులు కడుతున్నారని అన్నారు, ఒక పేదవాడి బిడ్డ చదువుకోవాలంటే ఈ సమాజంలో, ఈ కూటమి ప్రభుత్వ హయాంలో ఇంతటి అవమానాన్ని ఎదుర్కోవాలా? చదువుకోవడం నేరమా అని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు?"

ఈనెల 11వ తేదీ నుండి శాసనమండలి సమావేశాలు జరుగుతున్నాయని ఆ సమావేశాల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శాసనమండలి సభ్యులు ఈ విషయంపై గందరగోళం చేస్తారన్న ఉద్దేశంతో, హఠాత్తుగా ఈనెల 10వ తేదీనే 1200 కోట్ల రూపాయలకు సంబంధించినవాలుగు జీవోలను విడుదల చేసి తదుపరి ఈరోజు వరకు ఆ జీవోలు అమరుకు నోచుకోలేదన్నారు.

ప్రభుత్వ ప్రకటనలకు, క్షేత్రస్థాయి పరిస్థితులకు అస్సలు పొంతన లేదన్నారు.

జీవో ఇచ్చి చేతులు దులుపు కోవడమే మీ పనా అని అడుగుతున్నామన్నారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి 1200 కోట్ల రూపాయల బకాయిలు విడుదల చేస్తూ జీవో ఇచ్చి వారం రోజులు దాటినా, ఆ నిధులు విద్యార్థుల ఖాతాల్లో ఎందుకు జమ కాలేదని వీరన్న ప్రశ్నించారు.బడ్జెట్‌లో విద్య కోసం కేటాయించిన నిధులు ఏమయ్యాయి? కేటాయింపులు కేవలం కాగితాలకే పరిమితమా? విడుదలలో జాప్యం ఎందుకు జరుగుతుందన్నారు మీ పత్రికలో నిధులు విడుదలయ్యాయని గొప్పలు చెప్పుకుంటున్నారే కానీ, అవి లబ్ధిదారులకు ఎందుకు జమ కాలేదన్న విషయాన్ని పట్టించుకోవడం లేదన్నారు. వేల సంఖ్యలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటం కూటమి ప్రభుత్వానికి తగదని ఆయన ఎద్దేవా చేశారు,, ఒకవేళ కూటమి ప్రభుత్వం విద్యార్థుల ఫీజుల చెల్లింపు విషం పై ఇదేవిధంగా వైఖరిని కొనసాగిస్తే మా అధినేత జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థుల పక్షాన పోరాటం చేయడానికి సిద్ధమవుతావని ఆయన హెచ్చరించారు

# చిరు వ్యాపారికి అండగా లోకేష్ సమాజానికి మంచి సందేశం

## ఉండవల్లి అరుణ్‌కుమార్ ప్రశంసలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



రాష్ట్ర మంత్రి నారా లోకేష్ కర్నూలుకు చెందిన కోవా బన్ వ్యాపారి వలీకి మద్దతుగా నిలవడం అభినందనీయమని మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. రాజమండ్రి ధర్మంచర కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల మేడారం జాతరలో కోవా బన్‌లు విక్రయిస్తున్న వలీని ఓ యూట్యూబ్ చానల్ నిర్వాహకుడు అనవసరంగా ప్రశ్నిస్తూ, నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేసిన ఘటన తెలిసిందే. ఆధార్ కార్డు చూపించాలని, పేరు చెప్పాలని ఒత్తిడి చేస్తూ అతని ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించారని విమర్శలు వచ్చాయి. తాను అమ్ముతున్న బన్ నాణ్యమైనదేనని నిరూపించేందుకు వలీ అదే అక్కడ తిని చూపించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ ఘటనపై స్పందించిన నారా లోకేష్ 'ఎక్స్' వేదికగా వలీకి అండగా నిలుస్తామని, త్వరలోనే కలిసి కోవా బన్ రుచి చూస్తానని ప్రకటించారు. సామరస్యం, పరస్పర గౌరవం, సోదరభావం మన తెలుగు సమాజం విలువలని ఆయన పేర్కొన్నారు. లోకేష్ స్పందనపై రాష్ట్రవ్యాప్తంగా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయని ఉండవల్లి అరుణ్‌కుమార్ తెలిపారు. "చిరు వ్యాపారికి అండగా నిలబడి మంచి పౌర సంస్కృతికి దారితీశారు. కులమతాలకు అతీతంగా సమాజం ముందుకు సాగాలని లోకేష్ స్పష్టమైన సందేశం ఇచ్చారు" అని ఆయన అన్నారు.



# ప్రతి ఒక్కరూ మానవత్వంతో స్పందించాలి

## డాక్టర్ కందుల నాగరాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

ప్రతి ఒక్కరు మానవత్వంతో స్పందించి, సాటి వారికి సహాయం చేయాలని విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32 వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అన్నారు. 32 వ వార్డు ప్రాంతంలో నవ వధువు అనూషకు బంగారు తాళిబొట్టు, పట్టుచీర, పసుపు కుంకుమలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాల నుంచి కేఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిర్విరామంగా సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు పరిధిలోనే కాకుండా నియోజకవర్గ పరిధిలో కూడా ఎవరికి ఎటువంటి సమస్య వచ్చినా తాను ముందు ఉంటూ వారికి తన పరిధి మేరకు సహాయం చేస్తున్నట్లు వెల్లడించారు. నిరుపేద విద్యార్థులకు, వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు, గర్భిణీ స్త్రీలకు తన వంతు సహాయం చేస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా తన సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన, యాదగిరి శ్రీను, సిపిఐ బుజ్జి ,అప్పారావు , శ్రీదేవి, కోదండమ్మా , జానకీ, సీత,ఉమా, హేమ,కుమారి తదితరులు పాల్గొన్నారు.

# తీరనున్న ప్రయాణికుల కష్టాలు

**మాడుగుల ఫిబ్రవరి 18 , జయ జయహే**

మాడుగుల ప్రాంత ప్రజలు గత కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న రహదారి సమస్య ఎట్టకాలకు మరికొద్ది రోజుల్లో పరిష్కారం కానుంది. స్థానిక ఎమ్మెల్యే బంగారు సత్యనారాయణమూర్తి ప్రత్యేక తర్వాత వడ్డాది నుంచి తాటిపర్తి వరకు 23 కోట్ల రూపాయలతో ఈ రహదారి పనులు చురుకుగా సాగుతున్నాయి. మార్చినాటికి ఈ పనులు పూర్తవుతాయని ఎమ్మెల్యే తెలిపారు. మరో 30 సంవత్సరాల వెనక్కి చూడకుండా రెండు లేయర్లతో రోడ్డు నిర్మిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఎం కోటపాడు కేజే పురం మధ్యలో ఈ రహదారి నిర్మిస్తున్నారు. ఇప్పటికే తాటిపర్తి నుంచి ఎం కోటపాడు వరకు రోడ్డు వరకు రోడ్డు నిర్మాణం చేపట్టగా మిగిలిన రోడ్డుపన్నులు చురుకుగా సాగుతున్నాయి. గత ఏడు సంవత్సరాలు నుంచి ఈ రోడ్డు అస్తవ్యస్తంగా ఉండడంతో అనేక ప్రమాదాలు చోటుచేసుకోవడంతో పాటు వాహనదారులు బాట సారులు ఇబ్బందులకు గురవుతూ వస్తున్నారు. ఈ నేపద్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు ప్రజల నుంచి వత్తిడి రావడంతో పాటు స్థానిక ఎమ్మెల్యే కూడా ప్రత్యేక దృష్టి సాధించారు. దీంతో ఈ రోడ్డుకు మహర్దశ పట్టింది. అలాగే ఘాటి రోడ్డు నుంచి మాడుగులకు కూడా రోడ్డు నిర్మించాలని మాడుగుల ప్రజలు కోరుతున్నారు. అయితే ఈ రహదారిని కూడా అభివృద్ధి చేసి నిర్మిస్తామని



ఎమ్మెల్యే బండారు ఇటీవలే ఒక సమావేశంలో ప్రకటించారు. దీంతోపాటు పాడేరు నుంచి మాడుగుల,కే కోటపాడు మీదగా విశాఖకు తక్కువ సమయంలో చేరే విధంగా మరో రోడ్డు కూడా నిర్మించడం జరుగుతాదని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న చొక్కాకుల





**అనకాపల్లి (జయ జయహే)**

అనకాపల్లి ఎంపీ కార్యాలయంలో పార్లమెంట్ సభ్యులు మరియు రైల్వే శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ సి.ఎం రమేష్ జన్మదిన వేడుకలు నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు మధ్య ఘనంగా నిర్వహించారు . ఈ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. అత్యవసర సమయంలోను, రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలు రక్షించడానికి ఇలాంటి బ్లడ్ డొనేషన్ క్యాంప్స్ అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ ఆఫీస్ ఇంచార్జ్ విజయ్ నాయుడు, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు, గవర వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ మల్ల సురేంద్ర, చోడవరం నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పి.వి.ఎస్. ఎన్ రాజు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి దాడి రత్నాకర్, బిజెపి పార్టీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ ఈర్లె శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులు పెంటకోట అప్పారావు, బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొర్లె రామునాయుడు, సబ్బవరం మండలం అంతకాపల్లి ఎంపీటీసీ చొక్కాకుల గోవింద, అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు గొటివాడ సామ్రాట్ కుమార్, అనకాపల్లి జిల్లా యువ మోర్చా అధ్యక్షులు గేదల స్వరూప్, రాజాన అప్పారావు, కన్నాజి, సబ్బవరం మండలం బిజెపి పార్టీ అధ్యక్షుడు గొంప నర్సింగరావు, మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, మండల చక్రవర్తి, ఎం, ప్రభుకుమార్, దొడ్డి రామునాయుడు, బైలపూడి రమణ మరియు ఇతర నాయకులు కలిసి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు చొక్కాకుల వెంకట రావు పాల్గొని సీఎం రమేష్ జన్మదిన వేడుకలలో పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



# "ఐ డోంట్ కేర్ నన్ను భయపెట్టలేరు!"

## అంబటి రాంబాబు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

సీఎం చంద్రబాబు ను దూషించడం తో మాజీమంత్రి అంబటి రాంబాబు పై నమోదైన కేసులతో పాటు సంక్రాంతి సంబరాలు సందర్భంగా లాటరీ పేరిట ప్రజలను మోసం చేశారనే కారణంతో అంబటి పై నమోదైన కేసుల్లో కోర్టు బెయిల్ మంజూరు చేయడంతో అంబటి రాంబాబు బుధవారం సాయంత్రం రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి విడుదలై బయటకు వచ్చారు. అనంతరం ఆయన జైలు బయట మీడియాతో మాట్లాడుతూ....."నన్ను చంపేందుకు ప్రయత్నించారౌ అది కుదరక జైలుకి పంపించారు. కానీ నేను స్పష్టంగా చెబుతున్నా ం ఐ డోంట్ కేర్!" అంటూ గట్టిగా ప్రకటించారు. తనపై దాడి జరిగిందని, ఇంటిని ధ్వంసం చేశారని, ప్రాణాలకు ముప్పు కలిగించారని ఆయన ఆరోపించారు. "ఇది రాజకీయ వేధింపుల పరాకాష్ట. ప్రశ్నిస్తే కేసులు, మాట్లాడితే జైలు ం ఇదేనా మీ ప్రజాస్వామ్యం?" అంటూ కూటమి ప్రభుత్వాన్ని నిలదీశారు.

"నన్ను బెదిరిస్తే నేను మౌనంగా ఉంటాననుకుంటే పొరపాటు. ఐ డోంట్ కేర్! జైలు గోడలు నా స్వరాన్ని ఆపలేవు. ప్రజలే నా బలరౌ న్యాయమే నా ఆయుధం," అని ఘాటుగా స్పందించారు. తనపై నమోదైన కేసులు కక్షసాధింపునకు నిదర్శనమని, రాజకీయంగా అణగదొక్కే ప్రయత్నమేనని విమర్శించారు. జైలు బయట పెద్ద సంఖ్యలో చేరిన అనుచరులను ఉద్దేశించి మాట్లాడుతూ, "ఈ జనసందోహమే నా సమాధానం. ఎంత ఒత్తిడి తెచ్చినా వెనక్కి తగ్గను. ప్రజల కోసం నా పోరాటం కొనసాగుతుంది. ఐ డోంట్ కేర్ ం నిజం గెలుస్తుంది!" అని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో విమర్శించడం నేరమా? అన్యాయాన్ని ప్రశ్నిస్తే జైలా? అంటూ ఆయన వేసిన ప్రశ్నలు రాష్ట్ర రాజకీయాల్లో మరింత దుమారం రేపుతున్నాయి. తనపై జరిగిన దాడులు, కేసులపై న్యాయపరమైన పోరాటం కొనసాగిస్తానని, "నన్ను ఆపలేరౌ ప్రజల తీర్పే అంతిమం," అంటూ ధీమా వ్యక్తం చేశారు. అంతకుముందు జైలు బయట మాజీ ఎమ్మెల్యే, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా ఆధ్వర్యంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాల్, తానేటి వనిత, అధిక సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ప్రత్యూషా.. అయేషా మీరా.. సుగాలి ప్రీతి కేసులు: న్యాయం ఎప్పుడు?

## రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షుడు మేడా శ్రీనివాస్

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



రెండు దశాబ్దాలకు పైగా గడిచినా సినీనటి ప్రత్యూష హత్య కేసులోనూ, విద్యార్థిని అయేషా మీరా దారుణ హత్య కేసులోనూ నేరస్తులు శిక్షించబడకపోవడం బాధాకరమని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు మేడా శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే సుగాలి ప్రీతి ఘటనను కూడా ప్రస్తావిస్తూ, బాధిత కుటుంబాలకు సంపూర్ణ న్యాయం జరగలేదని అన్నారు. ప్రత్యూషా కేసులో పోస్టుమార్టం నివేదికలో లోపాలు ఉన్నాయని సుప్రీంకోర్టు గుర్తించిన నేపథ్యంలో, ఆ నివేదికకు బాధ్యులైన అధికారులపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. విచారణలో సంబంధం లేని సెక్షన్లు చేర్చడం, దర్యాప్తు లోపాలు, అధికార దుర్వినియోగం వంటి అంశాలు కేసు బలహీనపడటానికి కారణమయ్యాయా అనే అనుమానాలు వ్యక్తం చేశారు. అయేషా మీరా కేసులోనూ నిజమైన నేరస్తులు శిక్షించబడలేదన్న భావన సమాజంలో బలపడుతోందన్నారు. తీర్పులు వెలువడుతున్నా, బాధిత తల్లుల హృదయ వేదనకు మాత్రం ముగింపు కనిపించడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు మానవత్వంతో స్పందించి, పెండింగ్‌లో ఉన్న అనుమానాలపై సమగ్ర పునర్విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

"దేశంలో చట్టాలు నిజంగా ఎవరి కోసం పనిచేస్తున్నాయన్నది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ప్రజల మౌనం, భయాలు, బలహీనతలే ఇలాంటి దురాగతాలకు కారణం" అని మేడా శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజలు ఓటర్లుగా మాత్రమే కాక, మనుషులుగా ఆలోచించి న్యాయం కోసం నిలబడాలని పిలుపునిచ్చారు.

# రావివలస ఎండల మల్లన్న ఆలయ ఆదాయం

## భక్తి శ్రద్ధలతో శివరాత్రి ఉత్సవాలు విజయవంతం

**టెక్కలి ఫిబ్రవరి 18 జయ జయహే**

శ్రీకాకుళం జిల్లా టెక్కలి మండలం లో వెలసిన సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఎండల మల్లికార్జున స్వామి ఆలయశీ లో ఇటీవల జరిగిన మహాశివరాత్రి మహోత్సవాల్లో ఒడిస్సా, చత్తీస్గడ్, రెండు తెలుగు రాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తుల పూజలు వచ్చిన ఆదాయాలను దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో లెక్కించారు, మహాశివరాత్రి ఆదా యాలు ఈ విధంగా ఉన్నాయి, శీర్షాబి అభిషేకానికి 2,92 లక్షలు, శీఘ్ర దర్శనానికి 2,17 లక్షలు, కేశఖండన టిక్కెట్లు 10 వేలు, హుండీ ఆదాయం 3,99 లక్షలు. లడ్డు ప్రసాదశీ 3,6 లక్షలు. పులిహోర ప్రసాదం 1.15 లక్షలు. మొత్తం ఆదాయం 13,39,352 లక్షల రూపాయలు సమకూరినట్లు ఎండల మల్లికార్జున స్వామి ఆలయ అధికారి గురునాధరావు తెలిపారు.





## మాడుగులలో ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

**మాడుగుల ఫిబ్రవరి 18 జయ జయహే**

అనకాపల్లి పార్లమెంటు సభ్యుడు రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్ జన్మదిన వేడుకలు బుధవారం మాడుగుల లో బిజెపి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసే శుభాకాంక్షలు తెలిపారు అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తరాంధ్ర మహిళా మోర్చా ఇంచార్జ్ మండల సంతోషి సుబ్బలక్ష్మి, పార్టీ నాయకులు మెల్లిపాక స్వామి, పుట్ట నాగేంద్ర, మండల ఛాయారాం, కే వెంకటేశ్వరరావు, కర్రీ రాజు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



## రాజేంద్రపాలెంలో బస్సు షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన..

**కొయ్యూరు :(జయ జయహే)న్యూస్ ఫిబ్రవరి 19**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండల కేంద్రం రాజేంద్రపాలెం లో 5 లక్షల రూపాయలు అరకు ఎంపి నిధులతో రాజేంద్రపాలెం లో బస్సు నూతన బస్సు షెల్టర్ నిర్మాణానికి ఎంపీపీ బడుగు రమేష్, సర్పంచ్ పిటా సింహాచలం చేతుల మీదుగా శంకుస్థాపన జరిగింది.పాత బస్సు షెల్డర్ సిదిలావస్థలో ఉండడం వలన అదే ప్రదేశం లో నూతన బస్సు షెల్డర్ నిర్మాణానికి కి అరకు ఎంపి దనూజా రాణి ఐదు లక్షలు మంజూరు చేసారు.ఈ కార్యక్రమం లో టీడీపీ నేత ఎస్.కే.ఖాన్, వైసీపీ నేత నర్సి కృష్ణ,సుమర్ల సూరిబాబు, కుమారి పాల్గొన్నారు.

# అంతర్జాతీయ కృత్రిమ మేధస్సు హబ్‌గా భారత్

**(సి.హెచ్.ప్రతాప్)**

*దేశం ఎప్పుడూ ముందు వరుసలోనే ఉంటుంది. భారీ స్థాయిలో ఉన్న మానవ వనరులు, విస్తారమైన సమాచార లభ్యత మన దేశాన్ని ఈ రంగంలో అగ్రగామిగా నిలబెడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సేవలకు పేరుగాంచిన భారతదేశం, ఇప్పుడు కృత్రిమ మేధస్సు ఆధారిత నూతన ఆవిష్కరణలను సృష్టించే దిశగా బలమైన అడుగులు వేస్తోంది. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థతో పాటు సామాజిక స్థితిగతుల్లో కూడా గొప్ప మార్పులు రానున్నాయి.*




భారతదేశంలో కృత్రిమ మేధస్సు విస్తరణకు అనేక అవకాశాలు మెండుగా ఉన్నాయి. మన దేశంలో ఉన్న అత్యధిక యువ జనాభా, సమాచార సాంకేతిక రంగంలో ఉన్న అపారమైన అనుభవం మనకు ప్రధాన బలాలుగా నిలుస్తాయి. వైద్య రంగంలో కృత్రిమ మేధస్సును ఉపయోగించడం ద్వారా మారుమూల గ్రామాలకు సైతం అత్యుత్తమ నాణ్యమైన చికిత్సను అందించవచ్చు. రోగాలను ముందుగానే గుర్తించడం, తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు నిర్వహించడం వంటివి దీని ద్వారా సులభంగా సాధ్యమవుతాయి. అలాగే వ్యవసాయ రంగంలో భూమి స్వభావాన్ని బట్టి ఏ రకమైన పంటలు వేయాలో సూచించడం, వాతావరణ మార్పులను ముందే అంచనా వేయడం వంటి కీలక అంశాల్లో కృత్రిమ మేధస్సు రైతులకు పెద్ద దిక్కుగా మారుతోంది. విద్యార్థులకు వారి మేధస్సుకు అనుగుణంగా వ్యక్తిగత పాఠ్యాంశాలను రూపొందించడంలో కూడా ఇది కీలక పాత్ర పోషిస్తోంది. దీనివల్ల విద్యారంగంలో నూతన ఒరవడి ప్రారంభమవుతుంది.

ఈ రంగంలో వస్తున్న పురోగతి గమనిస్తే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో కీలకంగా కనిపిస్తున్నాయి. భారత కృత్రిమ మేధస్సు లక్ష్యం పేరుతో ప్రభుత్వం సుమారు పదివేల కోట్ల రూపాయలకు పైగా నిధులను కేటాయించింది. దీని ద్వారా దేశీయంగా శక్తివంతమైన గణన సామర్థ్యాన్ని పెంపొందించడం, నవకల్పన సంస్థలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం వంటి పనులు అత్యంత వేగంగా జరుగుతున్నాయి. ఫిబ్రవరి రెండు వేల ఇరవై ఆరులో న్యూఢిల్లీలో జరిగిన భారత కృత్రిమ మేధస్సు ప్రభావ శిఖరాగ్ర సదస్సు ద్వారా ప్రపంచ దేశాల దృష్టిని భారత్ ఆకర్షించింది. ప్రపంచ దక్షిణ దేశాలలో ఇటువంటి భారీ సదస్సు నిర్వహించడం ఇదే మొదటిసారి కావడం విశేషం. ఈ సదస్సులో భాగంగా బాధ్యతాయుతమైన కృత్రిమ మేధస్సు వినియోగంపై ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించి ప్రపంచ రికార్డులను సైతం సృష్టించడం జరిగింది.

దేశంలో కృత్రిమ మేధస్సును ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక వినూత్న కార్యక్రమాలను చేపట్టింది. భాషా అనువాద యంత్రం అనే ప్రాజెక్టు ద్వారా ఇరవై రెండు భారతీయ భాషల్లో తక్షణ అనువాదాన్ని అందిస్తూ భాషా పరమైన అడ్డంకులను తొలగిస్తోంది. అందరికీ కృత్రిమ మేధస్సు వంటి ఉచిత విద్యా కోర్సుల ద్వారా సామాన్య ప్రజలకు, విద్యార్థులకు ఈ సాంకేతికతపై పూర్తి అవగాహన కల్పిస్తోంది. పాఠశాల స్థాయి నుండే అంటే మూడవ తరగతి నుండే కృత్రిమ మేధస్సు పాఠ్యాంశాలను ప్రవేశపెట్టడం ద్వారా భవిష్యత్తు తరాలను సాంకేతికంగా సిద్ధం చేస్తోంది. అలాగే అత్యున్నత గణన సౌకర్యాలు పరిశోధకులకు అండగా నిలుస్తున్నాయి. గుజరాత్ వంటి రాష్ట్రాలు ప్రత్యేకంగా కృత్రిమ మేధస్సు పరిశోధనా సంస్థలను ఏర్పాటు చేస్తూ దేశ ప్రగతికి తమవంతు తోడ్పాటును అందిస్తున్నాయి.




పరిశ్రమల పరంగా చూస్తే తయారీ రంగం, ఆర్థిక సేవలు, రవాణా వ్యవస్థల్లో కృత్రిమ మేధస్సు వినియోగం విప్లవాత్మక మార్పులు తెస్తోంది. బ్యాంకింగ్ రంగంలో ఆర్థిక మోసాలను అరికట్టడానికి, వినియోగదారులకు మెరుగైన సేవలు తక్కువ సమయంలో అందించడానికి ఈ సాంకేతికతను వాడుతున్నారు. స్మార్ట్ సిటీల నిర్మాణంలో ట్రాఫిక్ నిర్వహణ, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాల్లో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తోంది. విదేశీ పెట్టుబడులు కూడా ఈ రంగం వైపు అధికంగా మొగ్గు చూపుతున్నాయి. అంతర్జాతీయ సంస్థలు విశాఖపట్నం వంటి నగరాలలో తమ పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయడం మన దేశం యొక్క ప్రాముఖ్యతను చాటిచెబుతోంది. దేశీయ పారిశ్రామిక సమూహాలు కూడా వివిధ రాష్ట్రాలలో కృత్రిమ మేధస్సు నూతన ఆవిష్కరణ నగరాలను నిర్మిస్తున్నాయి.

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు నైతిక విలువలను కాపాడటం కూడా ఎంతో ముఖ్యమైన విషయం. సమాచార భద్రత, వ్యక్తిగత గోప్యత వంటి అంశాల్లో పటిష్టమైన చట్టాలు రూపొందించుకోవడం వల్ల ప్రజల్లో సాంకేతికతపై నమ్మకం పెరుగుతుంది. యువతకు ఈ రంగంలో సరైన శిక్షణ ఇవ్వడం ద్వారా ఉపాధి అవకాశాలు మరింత మెరుగుపడతాయి. భారతదేశం కేవలం ఒక వినియోగదారు దేశంగానే కాకుండా ఒక సృష్టికర్తగా ఎదగాల్సిన అవసరం ఉంది. ప్రపంచానికి అవసరమైన కృత్రిమ మేధస్సు పరిష్కారాలను మన దేశం నుండే అందించగలిగినప్పుడు భారత్ నిజమైన అంతర్జాతీయ కేంద్రంగా మారుతుంది. ఈ దిశగా సాగుతున్న అడుగులు భవిష్యత్తులో దేశ ఆర్థిక వ్యవస్థను ఐదు లక్షల కోట్ల డాలర్ల దిశగా నడిపిస్తాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. నవ భారత నిర్మాణంలో కృత్రిమ మేధస్సు ఒక బలమైన పునాదిగా నిలుస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఈ సాంకేతికత ఫలాలు అందేలా చూడటం ద్వారా సామాజిక సమానత్వం చేకూరుతుంది. భవిష్యత్తులో భారతదేశం సాంకేతిక రంగంలో ప్రపంచానికే మార్గదర్శిగా నిలవనుంది.

# రైతులకు బహుముఖ ప్రయోజనాల కోసం భారత్ విస్తార్

**(సి.హెచ్.ప్రతాప్)**

భారతదేశ వ్యాప్తంగా ఉన్న రైతు లోకానికి కేంద్ర ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. అన్నదాతల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వం వారి కోసం సరికొత్త డిజిటల్ విప్లవానికి శ్రీకారం చుట్టింది. రైతులకు ఆర్థికంగా ఎదగడానికి అవసరమైన సాంకేతిక సహకారాన్ని అందించే లక్ష్యంతో 'భారత్ విస్తార్' అనే నూతన డిజిటల్ వేదికను ప్రారంభించింది. ఈ కార్యక్రమం ద్వారా దేశంలోని కోట్లాది మంది రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు ఇంకా ప్రభుత్వ ఫలాలను నేరుగా పొందే అవకాశం కలుగుతుంది. రాజస్థాన్‌లోని జైపూర్‌లో జరిగిన ఒక ప్రత్యేక సమావేశంలో కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి ఈ వినూత్న సేవలను అధికారికంగా ప్రారంభించారు. జైపూర్‌లోని దుర్గాపురలో ఉన్న రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ సంస్థలో ఈ చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. ఈ డిజిటల్ వ్యవస్థ ద్వారా సమాచార లోపాన్ని అధిగమించి ప్రతి గ్రామానికి వ్యవసాయ విజ్ఞానాన్ని చేరవేయడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం.

రైతులు తాము పండించే పంటల గురించి సంపూర్ణ సమాచారాన్ని నిమిషాల వ్యవధిలోనే తెలుసుకునేలా ఈ వ్యవస్థను రూపొందించారు. భారత్ విస్తార్ సేవలు రైతులకు ఒక వరప్రదాయినిగా మారనున్నాయి. ఈ వేదిక ద్వారా రైతులు కేవలం ఒక పిలుపుతో తమకు కావలసిన అన్ని రకాల వివరాలను సేకరించవచ్చు. ఇందులో ప్రధానంగా పంటలకు సంబంధించిన శాస్త్రీయ సలహాలు లభిస్తాయి. ఏ సమయంలో ఏ పంట వేయాలి విత్తనాల ఎంపిక నుంచి కోతల వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను నిపుణులు వివరిస్తారు. మార్కెట్‌లో వివిధ పంటల ధరల వివరాలు ఎప్పటికప్పుడు రైతులకు అందుబాటులో ఉంటాయి. దీనివల్ల దళారుల బెడద తగ్గి రైతులకు గిట్టుబాటు ధర లభించే అవకాశం ఉంటుంది. వాతావరణ పరిస్థితుల గురించి ముందస్తు సమాచారం అందడం వల్ల ప్రకృతి వైపరీత్యాల నుండి పంటలను కాపాడుకోవడానికి వీలవుతుంది. ఈ సమాచార వ్యవస్థ కేవలం సాగుకే పరిమితం కాకుండా విత్తనాల నాణ్యత ఇంకా ఎరువుల వినియోగం వంటి కీలక అంశాలపై కూడా రైతులకు స్పష్టతనిస్తుంది.

డిజిటల్ ఇండియా లక్ష్యాలను గ్రామీణ స్థాయికి తీసుకెళ్లడంలో ఈ ప్రయత్నం కీలక పాత్ర పోషిస్తుంది. వ్యవసాయ రంగంలో సాంకేతికతను జోడించడం ద్వారా



ఉత్పాదకతను పెంచవచ్చని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కేవలం సాగు పనులకే పరిమితం కాకుండా పశుపోషణ వైపు కూడా రైతులను ప్రోత్సహించడం ఈ పథకం ఉద్దేశ్యం. దీనివల్ల రైతుల ఆదాయం రెట్టింపు కావడానికి మార్గం సుగమం అవుతుంది. ఈ వేదిక ప్రత్యేకత ఏమిటంటే రైతులు తమకు నచ్చిన భాషలోనే సమాచారాన్ని పొందే వీలుంది. భాషా పరమైన ఇబ్బందులు లేకుండా సామాన్య రైతు సైతం ఈ సాంకేతికతను సులభంగా వినియోగించుకోవచ్చు. శాస్త్రవేత్తలు పరిశోధనాలయాల్లో కనుగొన్న కొత్త విషయాలను నేరుగా పొలాల్లోకి తీసుకెళ్లడానికి ఈ భారత్ విస్తార్ ఒక వారధిలా పనిచేస్తుంది. ప్రతి రైతు తన స్మార్ట్ ఫోన్ ద్వారా లేదా టోల్ ఫ్రీ నంబర్ ద్వారా నేరుగా నిపుణులతో మాట్లాడి తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

వ్యవసాయ రంగంలో ఇదొక చారిత్రాత్మక అడుగు అని ప్రభుత్వం పేర్కొంది. గతంలో సమాచారం అందక రైతులు అనేక ఇబ్బందులు పడేవారని ఇప్పుడు ఆ పరిస్థితి మారుతుందని అధికార యంత్రాంగం ధీమా వ్యక్తం చేసింది. ప్రభుత్వ పథకాలు సబ్సిడీలు ఇంకా విత్తన లభ్యత వంటి అంశాలపై కూడా ఈ వేదిక ద్వారా అవగాహన కల్పిస్తారు. ఆధునిక యంత్రాల వినియోగం భూసార పరీక్షల ప్రాముఖ్యతను రైతులకు వివరించడం ద్వారా సాగు ఖర్చు తగ్గించి లాభాలను పెంచడమే ఈ భారత్ విస్తార్ ప్రధాన లక్ష్యం. దేశవ్యాప్తంగా ఉన్న రైతులందరూ ఈ ఉచిత సేవలను వినియోగించుకుని అభివృద్ధి చెందాలని ప్రభుత్వం ఆకాంక్షిస్తోంది. సమాచార విప్లవం ద్వారా సాగును పండుగలా మార్చే దిశగా ఈ కార్యక్రమం ఒక గొప్ప మైలురాయిగా నిలుస్తుంది. వ్యవసాయ రంగం బలోపేతం అయితేనే దేశం సుభిక్షంగా ఉంటుందనే నమ్మకంతో కేంద్రం ఈ అడుగు వేసింది. రానున్న రోజుల్లో ఈ వ్యవస్థలో మరిన్ని మార్పులు తీసుకువచ్చి దేశంలోని ప్రతి మారుమూల ప్రాంతానికి ఈ సేవలను విస్తరించనున్నారు. ఇది అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుతుందని ప్రభుత్వం విశ్వసిస్తోంది.



## జి.ఎం.ఆర్ ఫర్నిచర్ షాప్ మహోత్సవం

**చైర్మన్ దొన్ను దొర**

**అరకులోయ: జయ జయహే.**

గుజ్జెల మాణిక్యం, రత్నం దంపతులకు చెందిన జిఎంఆర్ ఫర్నిచర్ షాప్ ను తెలుగుదేశం పార్టీ అరకు నియోజకవర్గ ఇన్చార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాస్ బాబు సంయుక్తంగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దొన్ను దొర మాట్లాడుతూ. మాణిక్యం రత్నం దంపతులు వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి చెంది పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని ఆయన ఆకాంక్షించారు. మంచి మనసున్న మాణిక్యం లాంటి వ్యక్తులు వ్యాపార రంగంలో అభివృద్ధి చెందితే ఖచ్చితంగా తనకు అవకాశం ఉన్నంత మేరకు పేదవారికి తన దగ్గర ఉపాధి కల్పిస్తారని ఆయన పేర్కొన్నారు. ఆయన వ్యాపారంగం రంగానికి సంబంధించి ఫర్నిచర్ షాప్ ప్రారంభోత్సవంలో తనను ఆహ్వానించినందుకు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు వ్యాపార రంగంలో మంచి అభివృద్ధిని సాధించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పాడి చందు, టీడీపీ మండలం ప్రధాన కార్యదర్శి పాంగి రాజు, పంచాయతీ అధ్యక్షులు బోయి దామోదర్, నియోజకవర్గం ఎస్టి సెల్ అధ్యక్షులు బురిడీ కొములు నాయుడు, మాజీ ఎంపీటీసీ కిల్లో కుమార్, మాజీ ఎంపీటీసీ వంతల వెంకట్ రావు, టీడీపీ నాయకులు కిల్లో శ్యామ్, క్లస్టర్ ఇంచార్జి కొర్ర నాగరాజు, సిరిగాం పంచాయతీ అధ్యక్షులు పూజారి మాణిక్యం, కిల్లో బాబురావు, క్లస్టర్ ఇంచార్జ్ కొర్ర శేఖర్ టీడీపీ నాయకుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే

**చోడవరం ఫిబ్రవరి 18 జయ జయహే**




సమగ్ర శిక్ష ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న లాంగ్వేజ్ ఫెస్టివల్స్ కార్యక్రమంలో భాగంగా గురువారం చోడవరం నియోజకవర్గం పరిధిలో గల రోలుగుంట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఇంగ్లీష్ లాంగ్వేజ్ డే ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం పాఠశాల స్థాయిలో విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో పలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎస్సే రైటింగ్ పోటీలు, క్విజ్ పోటీలు, డిబేట్ పోటీలు, కాన్వర్సేషన్ స్కిట్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. అలాగే మ్యాగజైన్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యకలాపాలు, నిర్వహించి విద్యార్థుల్లో వినడం, మాట్లాడడం, చదవడం, వ్రాయడం వంటి నైపుణ్యాలను పెంపొందించేలా చర్యలు తీసుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.వి. శేషగిరిరావు మాట్లాడుతూ, ఇంగ్లీష్ భాష ప్రస్తుత ప్రపంచంలో అంతర్జాతీయ ప్రాముఖ్యత కలిగిన భాష అని, విద్యార్థులు భాషపై పట్టు సాధించడం ద్వారా ఉన్నత అవకాశాలను పొందగలరని తెలిపారు. ఆంగ్ల ఉపాధ్యాయులు పి.వి.ఎం. నాగజ్యోతి మాట్లాడుతూ భాష ప్రాముఖ్యతను వివరించారు.ముఖ్యంగా ఫోనెటిక్స్ వంటి విషయాలను నేర్చుకోవడంలో భాషలో స్పష్టత ఎంత అవసరమో తెలిపారు. ఇంగ్లీష్ ఒక గ్లోబల్ లాంగ్వేజ్‌గా ప్రపంచవ్యాప్తంగా సంభాషణకు వేదికగా నిలుస్తోందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆలోచనా శక్తి మరియు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించేందుకు ఈ ఇంగ్లీష్ లాంగ్వేజ్ యాక్టివిటీస్ ఎంతగానో సహాయపడతాయని వివరించారు. సిఆర్పి సతీష్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు మార్గనిర్దేశనం చేశారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. లాంగ్వేజ్ ఫెస్టివల్స్ ద్వారా విద్యార్థుల్లో భాషాపట్ల ఆసక్తి పెంపొందించడమే కాకుండా, సృజనాత్మకత ఆత్మవిశ్వాసం పెరిగేలా పాఠశాల యాజమాన్యం చర్యలు చేపట్టింది.



## గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి:

### జెడ్పిటిసి రాంబాబు

**బుచ్చియ్యపేట జయ జయహే**

గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు జడ్పిటిసి గ్రాంట్ నిధులను వెచ్చిస్తున్నామని జెడ్పిటిసి దొండా రాంబాబు తెలిపారు.రూ.7 లక్షల జిల్లా పరిషత్ నిధులతో అయితంపూడిలో అంగనవాడి భవనం ఆధునికరణ చేపట్టారు. బుధవారం దీనిని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇప్పటికే త్రాగునీటి బోర్లు ఏర్పాటు చేశామన్నారు. పలు గ్రామాల్లో అంగన్వాడీ భవనాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు.భవిష్యత్తులో ఐతంపూడి గ్రామాన్ని జడ్పీ నిధులతో మరింత అభివృద్ధి చేస్తామన్నారు.స్థానిక ఎస్సీ కాలనీలో వినాయకుడి గుడి నిర్మాణ పనులను పరిశీలించారు.ఓ దివ్యాంగురాలికి సదరం సర్టిఫికెట్ పంపిణీ చేశారు.స్థానిక సర్పంచ్ పెద్దాడ నాయుడు, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచులు గోపిశెట్టి శ్రీను,ఆది సత్యనారాయణ,స్థానిక వైసీపీ నేతలు ముచ్చకర్ల రాజు నాయుడు, ముచ్చకర్ల పోతురాజు, ముచ్చకర్ల వెంకట్రావు, అయితిరెడ్డి రమణ, అయితిరెడ్డి శ్రీను, పిళ్లా అప్పలనాయుడు, పోతల రాజబాబు, అయితిరెడ్డి శంకర్రావు, సుంకర రవి, ముచ్చకర్ల మహేష్, పాల్గొన్నారు.ం




## తూర్పుగోదావరి జిల్లాలో విలీన పోలీస్ స్టేషన్లపై ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆకస్మిక తనిఖీలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

తూర్పుగోదావరి జిల్లాలో ఇటీవల విలీనమైన పోలీస్ స్టేషన్ల పనితీరును సమీక్షిస్తూ జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట టౌన్, మండపేట రూరల్, అంగర, రాయవరం పోలీస్ స్టేషన్లను సందర్శించి రికార్డులు, పరిసరాల పరిశుభ్రత, సీసీ కెమెరాల పనితీరు, నమోదైన కేసుల స్థితిగతులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు పురోగతిపై అధికారులతో ఆరా తీసి, అవసరమైన సూచనలు జారీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండకూడదని స్పష్టం చేసిన ఎస్పీ, సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో ప్రత్యేకంగా సమావేశమై లా అండ్ ఆర్డర్ పరిస్థితులపై సమీక్షించారు. సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించి ప్రజలకు భద్రతాభావం కల్పించాలన్నారు. రికార్డులన్నీ క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ (జజుచీూ) పోర్టల్‌లో సమయానికి నవీకరించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ పరిధిలో గుర్తించిన బ్లాక్ స్పాట్లలో డ్రోన్ సర్వైలెన్స్ విస్తరించాలని, ముఖ్య ప్రాంతాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ నిర్వహించడంతో పాటు, విలేజ్ విజిట్స్, పల్లె నిద్రలను తప్పనిసరిగా చేపట్టాలని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు బలోపేతం చేయాలని ఆదేశించారు. రాత్రి గస్తీని ముమ్మరం చేసి, అనుమానితుల వేలిముద్రలను ఎంఎస్‌సీడీ పరికరాల ద్వారా పరిశీలించాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలలో డీఎస్పీ (ఈస్ట్ జోన్) బి. విద్య, మండపేట టౌన్ ఇన్స్పెక్టర్ డి. సురేష్, మండపేట రూరల్ ఇన్స్పెక్టర్ దొర రాజు, సబ్ ఇన్స్పెక్టర్లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



## ఏపీపీ చొరవతో మరల ఒకటైన భార్య భర్తలు

### న్యాయమూర్తుల సమక్షంలో దండలు మార్చుకున్న వైనం

**అభినందించిన గ్రామ పెద్దలు ఏపిపి**

**చోడవరం ఫిబ్రవరి 18, జయ జయహే**

విద్యావంతులైన ఇరువురు యువతీ యువకులు ఆరు మాసాల క్రితం హిందూ సాంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. అంతలోనే వారిద్దరి మధ్య చిన్న చిన్న మనస్పర్ధలు చోటుచేసుకుని దూరమయ్యారు. దీనిపై చోడవరం కోర్టులో కేసు దాకలైంది. ఈ నేపథ్యంలో ఏపీపి చీపురుపల్లి సూర్యనారాయణ చొరవ తీసుకొని వారిద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహించి, వారి తల్లిదండ్రులతో చర్చించి న్యాయమూర్తులు సమక్షంలో మరల ఒకటిగా చేశారు. దీంతో వారిద్దరి చేత న్యాయమూర్తులు దండలు మార్పించి ఒకటిగా చేస్తూ కలకాలం ఆనందంగా ఉండాలని ఆశీర్వదించారు. వివరాలు పరిశీలిస్తే చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన వుగ్గిన దొరతో ఆరు మాసాల క్రితం విశాఖకు చెందిన సింధుతో వివాహం జరిగింది. అయితే ఎంబీఏ చదువుకున్న దొర ఉద్యోగం చేస్తుండగా, సింధు కూడా అసిస్టెంట్ ప్రొఫెసర్ గా విజ్ఞాన్ కాలేజీలో పనిచేస్తుంది. అయితే మనస్పర్ధలుమూలంగా దూరంగా ఉంటూ విడాకుల కోసం చోడవరం సివిల్ జడ్జి కోర్టులో దరఖాస్తు చేసుకున్నారు. దీనిపై ఇద్దర్నీ ఒకటిగా చేయాలన్న ఏపీపీ సంకల్పం నెరవేరింది. ఇద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహించారు. దీంతో అమ్మాయి అత్తవారింటికి వెళ్లేందుకు అంగీకారం తెలపడంతో బుధవారం కోర్టు హాలులో అదనపు జిల్లా జడ్జి హరి నారాయణ, సీనియర్ సివిల్ జడ్జి గౌరీశంకర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ స్వర్ణ, ఏపీపీ సూర్యనారాయణ సమక్షంలో దండలు మార్పించి అభినందించారు. చిన్న చిన్న మనస్పర్ధలతో విడిపోవాలనుకున్న దంపతులకు వీరు స్ఫూర్తిదాయకమని న్యాయమూర్తులు చెబుతూ.. వీరిని ఆదర్శంగా తీసుకోవాలని, కలసి మెలిసి కమ్మని దాశీపత్యాన్ని కొనసాగించాలని కోరారు.ఈ సందర్భంగా దొర, సింధు మాట్లాడుతూ తిరిగి మమ్మల్ని ఒకటిగా చేసి మాలో సంతోషాన్ని నింపిన ఏపిపి సూర్యనారాయణకు వారు ధన్యవాదాలు తెలిపారు. అలాగే లక్ష్మీపురం గ్రామ పెద్దలు సిరిసొల్ల సత్యారావు, భూతనాథ్నీ నాని కుమార్ తదితరులు కూడా వారిని అభినందించారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

**చోడవరం,ఫిబ్రవరి 18, జయ జయహే**




గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు పరిశీలిస్తే.. చీడికాడ మండలం వరాహపురం గ్రామానికి చెందిన పెయింటర్ పీ.గంగు నాయుడు ,పి.దేముడు నాయుడులు సబ్బవరం లో పెయింటింగ్ పనులు పూర్తిచేసుకుని తిరిగి ప్రయాణంలో బుధవారం వరహాపురం వెళ్తూశీడగా అడ్డూరు గ్రామం వద్ద మోటార్ బైకును గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో గంగనాయుడికి కుడికాలు రెండు ముక్కలుకాగా, దేముడు నాయుడుకు చెయ్యి కూడా విరిగింది .దీంతో వీరిరువురిని 108 అంబులెన్స్ లో విశాఖ కెజీహెచ్ కు తరలించగా వారికి చికిత్స నిర్వహిస్తున్నారు.




## ఫీజు రీయింబర్స్మెంట్‌కు ఊపిరి విద్యా రంగంలో కూటమి కొత్త దిశ

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు ప్రారంభమయ్యాయని తెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎన్‌ఎస్‌ఎఫ్) రాజమండ్రి పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు సాయి దీపక్ పేర్కొన్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలుగా రూ.1200 కోట్లు విడుదల చేయడాన్ని ఆయన స్వాగతించారు. ఈ సందర్భంగా రాజమహేంద్రవరం పుష్కరాలరేవు వద్ద టీఎన్‌ఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. సాయి దీపక్ మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థుల సమస్యలను అర్థం చేసుకుని ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం అభినందనీయమన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలను నారా లోకేష్ ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల విడుదలతో మధ్యలోనే చదువు ఆపేసిన అనేక మంది విద్యార్థులకు మళ్లీ విద్యను కొనసాగించే అవకాశం కలిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర విద్యా రంగానికి మేలు చేస్తుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీఎన్‌ఎస్‌ఎఫ్, తెలుగు యువత నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అంకితభావంతో సేవలందిస్తే ఫలితాలు సాధిస్తాం

### పార్టీ పటిష్టతకు కలిసి పని చేద్దాం

**టెక్కలి ఫిబ్రవరి 18 జయ జయహే**

క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్సిపి కోసం అందరూ కలిసికట్టుగా అంకితభావంతో పనిచేసి సేవలందిస్తే మంచి ఫలితాలు సాధిస్తామని టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ అన్నారు. టెక్కలి వైఎస్ఆర్సిపి కార్యాలయంలో తనను మర్యాదపూర్వకంగా కలిసిన రాష్ట్ర ఆర్టిఐ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గా నియమితులైన ఆ కుర్రాడ లోక నాథం , శ్రీకాకుళం జిల్లా మహిళా విభాగం కార్యవర్గ సభ్యురాలుగా టెక్కలి విమల కార్యకర్తలకు తిలక్ సూచించారు, ఈ మేరకు లోకనాథం, విమల ఆయనకు సాలువా కప్పి సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో ప్రతి ఒక్క కార్యకర్త అంకితభావం సేవ నిరతి తో గ్రామాల్లో పనిచేయాలని సేవలందించిన ప్రతి వారికి పార్టీ గుర్తింపు ఉంటుందని , వైయస్సార్సీపి ప్రతినిధులమంతా కలిసికట్టుగా పనిచేసే మంచి ఫలితాలు వస్తాయని తిలక్ స్పష్టం చేశారు, ఆయనతోపాటు నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్మూర్తి, వైయస్సార్సీపి ప్రతినిధులు జద్యాడ జయరాం, హనుమంతు వెంకటేశ్వరరావు, ఆట్ల రాహుల్, కృష్ణారావు, ఉమాపతి, చలపతిరావు షాహు కారి శ్రీనివాస్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

## కొడితే బెయిల్.. తిడితే జైలు - ఇదేనా రెడ్ బుక్ రాజ్యాంగం?

### రాజమహేంద్రవరం ప్రెస్ మీట్‌లో ఉండవల్లి అరుణ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు

**రాజమహేంద్రవరం, జయజయహే ప్రతినిధి:**



“కొడితే బెయిల్ తిడితే జైలు అనే పరిస్థితి రాష్ట్రంలో నెలకొంది. ఇది ప్రజాస్వామ్య రాజ్యాంగం కాదు, రెడ్ బుక్ రాజ్యాంగం లాంటిదిగా మారింది” అంటూ మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాజమహేంద్రవరం లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రస్తుత రాజకీయ పరిణామాలపై స్పందించారు. గతంలో ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరియు తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర రావు రహస్య స్నేహితులుగా ఉన్నారని ఆరోపించిన ఆయన, అప్పట్లోనూ రాష్ట్ర విభజన హామీల అమలులో పెద్దగా పురోగతి లేదన్నారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగంగా స్నేహపూర్వకంగా ఉన్న పరిస్థితుల్లోనైనా విభజన హామీలు అమలు కావాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. విభజన సమయంలో ఇచ్చిన ప్రత్యేక హోదా, రాజధాని అభివృద్ధి, పోలవరం ప్రాజెక్టు పూర్తి వంటి హామీలపై ఇప్పటికీ స్పష్టత రాలేదని ఉండవల్లి విమర్శించారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే రాజకీయ నేతలు పరస్పర ఆరోపణలు మానుకుని, రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. రాజకీయ విభేదాలు సహజమని, అయితే ప్రజాస్వామ్య విలువలు దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. విభజన హామీల అమలుపై కేంద్రం మరియు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక ప్రకటించాలని డిమాండ్ చేశారు.

# అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు

### బడ్జెట్ సమావేశాల ముగిసే వరకూ స్టాళ్ల నిర్వహణ

### స్టాళ్ల ద్వారా ప్రఖ్యాత గాంచిన చేనేత వస్త్రాల విక్రయం

### చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచడమే లక్ష్యం : మంత్రి సవిత

**అమరావతి (జయ జయహే)**



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చేనేత రంగానికి అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యంగా చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచేలా ఎగ్జిబిషన్లు, బజార్లు, వివిధ సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటోంది. పండగ సమయాల్లో భారీ డిస్కౌంట్లు అందజేస్తూ చేనేత వస్త్రాల వినియోగం పెంచడంతో పాటు నేతన్నలకు ఏడాది పాటు ఉపాధి కల్పించడమే కాకుండా ఆదాయం ఆర్జించేలా చర్యలు తీసుకుంటోంది. దీనిలో భాగంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో చేనేత స్టాళ్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో అసెంబ్లీకి, శాసనమండలికి వస్తున్నారు. చేనేత వస్త్రాల అమ్మకాలు పెంచే లక్ష్యంతో గురువారం నుంచి బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకూ ఆప్కో ఆధ్వర్యంలో 12 స్టాళ్లను చేనేత, జౌళి శాఖాధికారులు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో తయారవుతున్న ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఈ స్టాళ్లలో విక్రయించేలా చర్యలు తీసుకుంటున్నారు. పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలతో పాటు ఇంటిల్లపాది వినియోగించుకునే రెడీమేడ్ దుస్తులను ఈ స్టాళ్లలో అమ్మకానికి అందుబాటులో ఉంచనున్నారు. లుంగీలు, టవళ్లు, దుప్పట్లు, ఇతర చేనేత వస్త్రాలను సైతం అమ్మకానికి పెట్టనున్నారు. గురువారం ఈ స్టాళ్లను ప్రారంభించి, అమ్మకాలు ప్రారంభించనున్నారు. అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాళ్లను రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత బుధవారం పరిశీలించారు. ఏయే వస్త్రాలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే ప్రపంచ ప్రఖ్యాతగాంచిన చేనేత వస్త్రాలను, పట్టు చీరలను అమ్మకానికి పెట్టాలని చేనేత, జౌళి శాఖాధికారులకు మంత్రి సవిత ఆదేశించారు. చేనేత స్టాళ్లతో పాటు ఫొటో స్టాల్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. చేనేత దుస్తుల వినియోగం పెంచేలా సీఎం చంద్రబాబునాయుడు దంపతులు, మంత్రి నారా లోకేశ్ దంపతులు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సహా పలువురు ప్రముఖులు చేనేత ఎగ్జిబిషన్లు సందర్శన, వారు చేనేత వస్త్రాల కొనుగోలు చేసిన, ధరించిన దృశ్యాలను ఈ ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. నేతన్నలతో సీఎం చంద్రబాబు నాయుడు సంభాషిస్తున్న దృశ్యాలు కూడా ఎగ్జిబిషన్లో ప్రదర్శనకు పెట్టారు.

### పశుపోషకులకు తక్కువ ధరల్లో

# జనరిక్ పశు ఔషధాలు

### రాష్ట్రవ్యాప్తంగా 150 పశు ఔషధ విక్రయ కేంద్రాలు: మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడి

**అమరావతి, (జయ జయహే)**



రాష్ట్రంలోని పశుపోషకులకు నాణ్యమైన జనరిక్ పశు ఔషధాలను తక్కువ ధరలకు అందుబాటులో ఉంచి పశుసంవర్ధక రంగాన్ని మరింత బలోపేతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు వ్యవసాయ,పశుసంవర్ధక, డెయిరీ అభివృద్ధి శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. 2024 ఎన్నికల మ్యానిఫెస్ట్ లో చెప్పిన విధంగా పశుపోశకులకు సబ్సిడీపై మందుల పంపిణీ అందచేసేలా చేసిన హామీని నేడు నెరవేర్చనున్నట్లు మంత్రి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 150 పశు ఔషధ విక్రయ కేంద్రాలను మొదటి దశలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కేంద్రాల ద్వారా పశుపోషకులకు తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలు అందించడంతో పాటు జంతువుల చికిత్స ఖర్చులను గణనీయంగా తగ్గించగలమన్నారు. గ్రామ స్థాయి గొర్రెల పెంపక సహకార సంఘాల ద్వారా మాత్రమే ఈ కేంద్రాలు నిర్వహించబడతాయని, మహిళా సభ్యులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆశావహ జిల్లాల్లో ఒక్కో కేంద్రానికి రూ. 1.5 లక్షల ప్రత్యేక సహాయం అందిస్తామని వెల్లడించారు. యూనిట్‌కు రూ. 3.61 లక్షల వ్యయంతో మొత్తం రూ. 5.41 కోట్ల ప్రాజెక్టును అమలు చేస్తున్నామని, కొనుగోలు మరియు నిల్వలపై 20 శాతం ప్రోత్సాహకం, విక్రయాలపై 20 శాతం మార్జిన్ లభిస్తుందని తెలిపారు. పీఎంబీఐ సమన్వయంతో నాణ్యత నియంత్రణ, సరఫరా నిర్వహణ జరుగుతుందని, ఈ కేంద్రాలు పశు వైద్యశాల ఆవరణలో నిర్వహించబడతాయని, అన్ని లావాదేవీలు పాయింట్ ఆఫ్ సేల్ ద్వారా నిర్వహిస్తామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, పశుసంవర్ధక రంగం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుందని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.



# సీపీఎస్ రద్దు చేయాల్సిందే!

### ఏపీ ఎన్‌జీజీవో నేతలకు సన్మానం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 18, జయ జయహే**

సీపీఎస్ రద్దు చేయాలని ఏపీ ఎన్‌జీజీవోస్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుదవారం కేజీహెచ్ నర్సింగ్ అసోసియేషన్ హాల్లో జరిగిన సమావేశంలో ఈ మేరకు పలు అంశాలపై సుధీర్ఘంగా చర్చించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా సీపీఎస్ రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిందని కానీ ఆ వైపు అడుగులు వేయడం లేదని అందుకు ఉద్యోగులంతా కలసికట్టుగా ప్రయత్నిస్తే ప్రభుత్వం ఉద్యోగుల కోర్కెలు తీర్చేందుకు సిద్ధమవుతుంసదన్నారు. ప్రభుత్వ నర్సుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గంగా భవానీ, వరలక్ష్మిల ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఎన్‌జీజీవోస్ జిల్లా అధ్యక్షులు ఈశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి శంకర్; ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏపీసీపీఎస్ఈఏ) రాష్ట్ర అధ్యక్షులు సతీష్ కుమార్ తదితరులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. అనంతరం ఏపీసీపీఎస్ఈఏ కేజీహెచ్ ఎన్నికలు నిర్వహించారు. నర్సింగ్ గ్రేడ్1 సూపరింటెండెంట్ సీహెచ్ పద్మావతిని అధ్యక్షురాలిగా, మరో 20 మందిని కార్యవర్గ సభ్యులిగా ఎన్నుకున్నారు.

# డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ కార్యక్రమం

**కొయ్యూరు/మర్రిపాలెం (జయ జయహే)**



ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, పీఎం ఉషా పథకం గ్రాంట్లతో 7 రోజుల డ్రోన్ టెక్నాలజీ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. చిట్టిబ్బాయి చైర్‌పర్సన్‌గా వ్యవహరించగా, మర్రిపాలెం కళాశాల ప్రిన్సిపాల్ డా. సుధ కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ముఖ్య వనరుల వ్యక్తిగా వి . శివ కార్తికేయ , సీఈఓ, కేదర్ హరి హేమ ఆక్సిజన్ డ్రోన్ టెక్నాలజీస్ అండ్ సొల్యూషన్స్ ప్రాజెక్ట్ ప్రైవేట్ లిమిటెడ్ పాల్గొన్నారు. డ్రోన్ టెక్నాలజీలో ఉన్న విభిన్న అవకాశాలు, వివిధ రకాల డ్రోన్లు, థర్మల్ డ్రోన్లు, మెడికల్ డ్రోన్ ట్రైనింగ్, మల్టీస్పెక్ట్రల్ డ్రోన్ ట్రైనింగ్ వంటి అంశాలపై సమగ్రంగా వివరించారు. మిలిటరీలో ఉపయోగించే ఎమ్ క్యూ 9, ఆర్ క్యూ 4 వంటి డ్రోన్ల ప్రాధాన్యతను వివరించి, విద్యార్థినులను డ్రోన్ టెక్నాలజీ రంగంలో శిక్షణ పొందేందుకు ప్రేరేపించారు. వైస్ ప్రిన్సిపాల్ డా. వి.కే.టి. మహాలక్ష్మి డ్రోన్ టెక్నాలజీ ప్రాధాన్యతపై మాట్లాడుతూ విద్యార్థినులకు ప్రోత్సాహన్నిచ్చారు గణితశాస్త్ర లెక్చరర్ మంగమ్మ సమన్వయకర్తగా వ్యవహరిస్తూ తన ప్రభావవంతమైన మాటలతో విద్యార్థినులను తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ప్రేరేపించారు. భౌతిక శాస్త్ర లెక్చరర్ డా. రాజు బాబు తన ప్రత్యేక శైలిలో విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతూ, ఈ శిక్షణ భవిష్యత్తులో ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వృక్షశాస్త్ర లెక్చరర్ కుమారి , రసాయన శాస్త్ర లెక్చరర్ డా. శ్రీవిద్య గారు, జంతుశాస్త్ర లెక్చరర్ డా. కృష్ణ , ఆంగ్ల లెక్చరర్ డా. జి. మేరీ పుష్ప సహా కళాశాల అధ్యాపకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.






# విశాఖ డైరీ పార్లర్ ప్రారంభం

**బుచ్చయ్యపేట జయ జయహే**

విశాఖ డైరీ పాడి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందని విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనందబాబుహో అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన విశాఖ డైరీ పార్లర్‌హాస్థానిక నాయకులతో కలిపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డైరీ ప్రారంభించినప్పటి నుండి రైతుల లను ఆదుకోవడానికి కృషి చేస్తుందన్నారు. అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు సీఎం రమేష్ జన్మదిన సందర్భంగా పేదలకు చీరలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డైరీ డైరెక్టర్‌గా గేదెల సత్యనారాయణ, మండల టీడీపీ పార్టీ అధ్యక్షులు ఏం వివి సత్యనారాయణ, గోకవాడ కోటేశ్వరరావు, వి య్యపు అప్పారావు, దేవర అప్పారావు ద్వారపూరెడ్డి అప్పలనాయుడు,హోహోముమ్మిన సూర్యనారాయణ సేనాపతి మణికంఠ పలు గ్రామాల పాల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాయకులు పాల్గొన్నారు.



# ఘనంగా సీఎం రమేష్ జన్మదిన వేడుకలు

**బుచ్చియ్యపేట జయ జయహే**

మండలంలోని వడ్డాదిలో బుధవారం బిజెపి నేతలు ఎంపీ సీఎం రమేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మసీద్, దేవాలయాలలో ఎంపీ పేరిట ప్రార్థనలు,పూజలు జరిపారు. అంతకు ముందు స్థానిక ఆసుపత్రులలో రోగులకు పండ్లు, రొట్టెలు అందజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఎంపీ సీఎం రమేష్ ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎంపీ సారథ్యంలో అనకాపల్లి జిల్లా సర్వతో ముఖాభివృద్ధి సాధిస్తుందన్నారు. మైనార్టీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాబాజీ,జిల్లా నాయకులు దూది రాజేష్, మండల బిజెపి అధ్యక్షుడు సీతా నాగరాజు,కార్యదర్శి దొండా నానాజీ,కిసాన్ మోర్చా జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ ఈశ్వరరావు,జిల్లా సోషల్ మీడియా కో-కన్వీనర్ మణికంఠ పాల్గొన్నారు.



# ఆర్టీసీ బస్సులో బంగారు గొలుసు చోరీ

**గోకవరం జయ జయహే ప్రతినిధి**

రాజమండ్రి గోకవరం బస్టాండ్ నుండి గోకవరం డిపోకు వస్తున్న సింగల్ స్టాప్ బస్సులో బుధవారం సాయంత్రం సమయంలో చోరీ జరిగింది. బాధితురాలు వెంటనే తన బంగారు గొలుసు కనబడటం లేదని కేకలు వేయడంతో అప్రమత్తమైన బస్సు డ్రైవర్ నేరుగా గోకవరం పోలీస్ స్టేషన్ కు తరలించారు. గోకవరం ఎస్సై పవన్ కుమార్ తన సిబ్బందితో ప్రయాణికులను వారి లగేజీ బ్యాగ్ లోను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ప్రయాణికుల సౌకర్యార్థం పోలీస్ స్టేషన్ నుండి బస్సును ఆర్టీసీ కాంప్లెక్స్ కు తరలించి,అక్కడ బస్సు దిగిన ప్రయాణికులను సైతం తనిఖీ చేశారు. ప్రయాణికులు పూర్తిగా దిగిపోయిన తర్వాత ఖాళీ బస్సులో కూడా తనిఖీ చేయడం జరిగింది. ఎంత వెతికినా బంగారు గొలుసు దొరకలేదు. దీంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.




# తప్పులేదు ప్రేమలో.. మూవీ పోస్టర్ విడుదల

**చోడవరం ఫిబ్రవరి 18**

తెలుగుదేశం నాయకుడు జి మల్లు నాయుడు సహాయ సహకారాలతో ఆధ్వర్యంలో అటాహాసంగా తప్పు లేదు ప్రేమలో మూవీ ఫస్ట్ లుక్ పోస్టర్ బుధవారం విడుదల చేశారు. దీనిలో చోడవరం బాలాజీనగర్ మల్ల విద్య సాగర్ ప్రొడ్యూసర్, డైరెక్టర్‌గా, హరి గణేష్ , ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. ఈలాంటి సినిమా లు చోడవరం లో రావడం , తీయడం చాలా సంతోషంగా ఉంది అన్ని మల్లునాయుడు అన్నారు. ఆయన ఎప్పుడు ఇటువంటి వినోదకరమైన మూవీస్ కి తోడు ఉంటానన్ని చెప్పి యూనిట్ బృందం తో సరదాగా ముచ్చటించారు.

# జిల్లా వ్యాప్తంగా ఎంపీ రమేష్ జన్మదిన వేడుకలు





### ప్రభుత్వ ఆసుపత్రిలో పళ్లు,పలహారాల పంపిణీ

### మండలాలు, గ్రామాల్లో భారీ కేక్ కటింగ్ కార్యక్రమాలు

### ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు

### రక్తదాన శిబిరాలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

### ఎంపీ క్యాంపు కార్యాలయంలో 100 కేజీల భారీ కేక్ కటింగ్

**అనకాపల్లి, ఫిబ్రవరి 18, జయ జయహే:**

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, అనకాపల్లి పార్లమెంటు సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ జన్మదినోత్సవ వేడుకలు అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా బుధవారం జరిగాయి. జిల్లాలోని ఏడు నియోజకవర్గ మండలాల్లో కూటమి నాయకులు,ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు పాల్గొని సేవా కార్యక్రమాలు చేపట్టారు.

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవా, రక్తదాన శిబిరాలు**

జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు పండ్లు,



బ్రెడ్లు, పలహారాలు పంపిణీ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రిలో ప్రత్యేకంగా కార్యక్రమాలు బిజెపి నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు మండలాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించగా యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఎంపీ కార్యాలయంలో 100 కేజీల భారీ కేక్ కటింగ్**

అనకాపల్లి ఎంపీ క్యాంపు కార్యాలయంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు గేదెల స్వరూప్ ఆధ్వర్యంలో 100 కేజీల భారీ కేక్ కటింగ్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వందలాది కార్యకర్తలు పాల్గొని సంబరాలు జరుపుకున్నారు.అదేవిధంగా ప్రత్యేక రక్తదాన శిబిరం ఏర్పాటు చేసి అనేక మంది రక్తదానం చేశారు. యువతకు ప్రోత్సాహం కల్పిస్తూ 61 మందికి ఉచిత హెల్త్ పాలసీలు అందజేశారు.ఎంపీ కార్యాలయం నేడు సేవా కార్యక్రమాల ప్రధాన కేంద్రంగా మారింది.

**ప్రతి మండలంలో విస్తృత సేవా కార్యక్రమాలు**

జిల్లాలోని దాదాపు 24 మండలాల్లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుల ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు భోజనం పంపిణీ,వృద్ధులకు దుప్పట్లు, మహిళలకు చీరలు,ఫుడ్ ప్యాకెట్లు పంపిణీ వంటి కార్యక్రమాలు చేపట్టారు. ప్రతి మండల కేంద్రంలో భారీ కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహించి సంబరాలు జరుపుకున్నారు.

**ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు**

జిల్లాలోని ప్రధాన దేవాలయాల్లో ఎంపీ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా నాయకులు పాల్గొని అభిషేకాలు,అర్చనలు నిర్వహించి ప్రార్థనలు చేశారు.మొత్తం రోజంతా అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఎంపీ డా. సి.ఎం రమేష్ జన్మదినోత్సవ వేడుకలు సేవా దృక్పథంతో నిర్వహించారు.

# ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ డిష్యుమ్... డిష్యుమ్

### ఏయూలో తీవ్ర ఉద్రిక్తత

### వందేమాతరం' అభ్యాసంపై దాడి

### ఎస్ఎఫ్ఐ కార్యకర్తల దుశ్చర్యగా ఏబీవీపీ అభివర్ణన

### రాష్ట్ర కార్యదర్శి వెంకట్ గోపి ఆగ్రహం

**విశాఖపట్నం, ఫిబ్రవరి 17, జయజయహే:**

ఆంధ్ర విశ్వవిద్యాలయ (ఏయూ) ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం మధ్యాహ్నం వరకు తీవ్ర ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. 'వందేమాతరం' గేయాన్ని అభ్యసిస్తున్న అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ), ఆర్ఎస్ఎస్ కార్యకర్తలపై ఎస్ఎఫ్ఐకి చెందిన వారు సామూహికంగా దాడికి పాల్పడటం క్యాంపస్‌లో కలకలం రేపింది. వందేమాతరం గేయం రాసి 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా, ఏబీవీపీ కార్యకర్తలు నిత్యం క్యాంపస్‌లో గేయ అభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం నాటి కార్యక్రమానికి విదేశీ భావజాలం గల



కొందరు అధ్యాపకులు, ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు ముందస్తు ప్రణాళికతో అడ్డు తగిలారని ఏబీవీపీ ఆరోపించింది. కర్రలు, రాళ్లతో విరుచుకుపడి కార్యకర్తలను గాయపరిచారని పేర్కొంది.

**దేశభక్తిని మతంలా చూడొద్దు: వెంకట్ గోపి**

ఈ ఘటనను ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ గోపి తీవ్రంగా ఖండించారు. 'భారత్ మాతా కి జై' అని నినదించడం దేశభక్తికి నిదర్శనమే తప్ప మతపరమైన చర్య కాదని ఆయన స్పష్టం చేశారు. వందేమాతరం నినాదాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని, ఏబీవీపీ అస్తిత్వాన్ని దెబ్బతీయడానికే ఈ దాడులకు పాల్పడుతున్నారని ఆయన మండిపడ్డారు.

**అంతర్జాతీయ కుట్ర కోణంపై అనుమానాలు..?**



ప్రస్తుతం విశాఖలో రాష్ట్రపతి ద్రౌపది ముర్మ పర్యటించే ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ జరుగుతున్న తరుణంలోనే ఈ ఘర్షణలు జరగడం వెనుక అంతర్జాతీయ కుట్ర దాగి ఉందేమోనని వెంకట్ గోపి అనుమానం వ్యక్తం చేశారు. గత కొద్ది కాలంగా ఎస్ఎఫ్ఐ వర్గీయులు సోషల్ మీడియా, వాట్సాప్ గ్రూపుల ద్వారా విద్యార్థుల్లో దేశ వ్యతిరేక భావజాలాన్ని నూరిపోస్తున్నారని ఆరోపించారు. ఈ దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. త్రీ టౌన్ పోలీసులు రంగప్రవేశం చేసి ఇరు వర్గాలను శాంతింపజేశారు. అయితే ప్రస్తుతం అల్లర్లు తగ్గినట్టు కనిపిస్తున్నా మళ్ళీ ఏ వేళలో అయినా పరస్పర దాడులు చెలరేగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తుంది.

## రూ. 1.17 కోట్ల జిల్లా పరిషత్ నిధులతో

# సమగ్ర శిశు అభివృద్ధి భవనాలు

### పాడేరు ఐసిడిఎస్ కేంద్ర కార్యాలయానికి రూ. 25 లక్షలు, శిశు గృహ భవనానికి రూ. 5లక్షలు

### అల్లూరి జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన 15 అంగనవాడీ కేంద్రాలకు రూ.87 లక్షలు

### ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర

### పాడేరులో నిర్మాణం జరుగుతున్న జిల్లా కేంద్ర ఐసిడిఎస్ భవన పనులు పరిశీలన

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో సమగ్ర శిశు అభివృద్ధి భవనాల కోసం రూ.1.17 కోట్లు మంజూరు చేసినట్లు ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. పాడేరులో ఐసిడిఎస్ కేంద్ర కార్యాలయ భవన నిర్మాణ పనులను సుభద్ర బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లాలో శిశు సమగ్ర అభివృద్ధి భవనాల నిర్మాణం కోసం జిల్లా



పరిషత్ నుంచి ఎన్నడూ లేని విధంగా అత్యధిక నిధులను కేటాయించినట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో స్వతంత్ర సమరయోధులు, మనందరికీ స్ఫూర్తిదాత అల్లూరి సీతారామరాజు పేరిట ఏర్పడిన కొత్త జిల్లాలో సొంత భవనాల నిర్మాణం కోసం తన వంతు సహకారం అందిస్తున్నామన్నారు. జిల్లా పరిషత్ నుంచి అవసరమైన నిధులను మంజూరు చేస్తున్నట్లు అన్నారు. ఈ క్రమంలో సమగ్ర శిశు అభివృద్ధి ( ఐసిడిఎస్ ) భవనాలు నిర్మాణానికి తొలి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. అందులో ఐసిడిఎస్ అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్ర కార్యాలయ భవనానికి రూ.30 లక్షల మంజూరు చేసినట్లు చెప్పారు. దీంతోపాటు శిశు గృహ నూతన భవనానికి మరో రూ. 5లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఐసిడిఎస్ కేంద్ర కార్యాలయం, శిశు గృహ భవనం నిర్మాణ పనులు శర వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనులు నిర్మాణ



ప్రక్రియను పరిశీలించేందుకు ఈరోజు పాడేరు రావడం జరిగిందని ఈ భవనాల నిర్మాణం పనులను అనుకున్న సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు. అయితే సమగ్ర శిశు అభివృద్ధి భవన నిర్మాణంలో రాజీ పడొద్దని సూచించారు.

**అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడీ భవనాలకు రూ. 87 లక్షలు**

అల్లూరి సీతారామరాజు జిల్లాలో అసంపూర్తిగా నిలిచిపోయిన 17 అంగన్ వాడీ భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు జిల్లా పరిషత్ నుంచి రూ.87 లక్షలు మంజూరు చేసినట్లు జల్లిపల్లి సుభద్ర వెల్లడించారు. వీటిల్లో జీకే వీధి, జి.మాడుగుల, పాడేరు, అనంతగిరి, అరకు, డుంబ్రిగూడ, ముంచంగిపుట్టు మండలాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్వాడీ కేంద్రాలకు ఈ నిధులు కేటాయించినట్లు ఆమె తెలిపారు.



### అప్పన్న హుండీ ఆదాయం

# రూ. 1.49 కోట్లు

### అప్పన్నకు విదేశీ భక్తులు తాకిడి

**విశాఖపట్నం /సింహాచలం (జయ జయహే)**

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. ఈ కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి జె. వెంకట్రావు ఆధ్వర్యంలో, అకౌంట్ సెక్షన్ ఏఇఓ వాద్రేవు రమణమూర్తి, పర్యవేక్షణ అధికారి రాజ్యలక్ష్మి పర్యవేక్షణలో నిర్వహించబడింది. ఈ లెక్కింపు ప్రక్రియలో జిల్లా అసిస్టెంట్ కమిషనర్ టి. అన్నపూర్ణ, భీమేశ్వర రాజరాజేశ్వరి ఆలయ ఈవో నీలిమ, ఉమా నీలకంఠేశ్వర స్వామి టెంపుల్ (రైల్వే న్యూ కాలనీ) ఈవో పి.ఎల్.ఎన్.ఎస్. రాజు పాల్గొన్నారు. ఎస్.పి.ఎఫ్. పోలీసుల కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈ కార్యక్రమం కొనసాగింది. జనవరి తేది 28.01.2026 నుండి 18.02.2026 వరకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ అధికారులు, సిబ్బంది ,సేవాదారులు లెక్కించారు. ఈ లెక్కింపులో స్వామివారికి నగదు రూపంలో మొత్తం రూ. 1,49,03,091/- ఆదాయం లభించింది.

నోట్ల రూపంలో వచ్చినది: రూ. 1,38,86,627/-

నాణేల (చిల్లర) రూపంలో వచ్చినది: రూ.10,16,464/-

సగటు రోజువారీ ఆదాయం: రూ. 7,09,671/-

బంగారం మరియు వెండి కానుకలు:

బంగారం: 187 గ్రాముల 180 మిల్లీగ్రాములు.

వెండి: 5 కిలోల 775 గ్రాములు.

దేశ విదేశాల నుండి వచ్చిన భక్తులు సమర్పించిన కరెన్సీలో ముఖ్యంగా అమెరికా 190 డాలర్లు, మలేషియా 1789 రింగిట్స్, ఆస్ట్రేలియా 100 డాలర్లు తో పాటుగా యూఏఈ, ఖతార్, ఇంగ్లాండ్, ఉజ్బెకిస్తాన్, సింగపూర్, నేపాల్ మరియు సౌదీ అరేబియా దేశాల నోట్లు లభించాయి. ఈ కార్యక్రమంలో దేవస్థాన అధికారులు, సిబ్బంది మరియు ఎస్.పి.ఎఫ్. రక్షణ సిబ్బంది పాల్గొన్నారు.



## ఎంపీ రమేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ

**విశాఖపట్నం, ఫిబ్రవరి 18, జయ జయహే:**

రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ అనకాపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ సి.ఎం రమేష్ అస్సాం రాష్ట్ర పర్యటనలో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంతా బిశ్వ శర్మ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఎంపీ సి.ఎం రమేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిస్వ శర్మ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన సందర్భంగా కుటుంబసమేతంగా గౌహతిలోని ప్రసిద్ధి చెందిన కామాఖ్య టెంపుల్ లో శ్రీ కామాఖ్యా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ముఖ్యమంత్రి తో భేటీ అయ్యారు. జన్మదిన సందర్భంగా స్వయంగా శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రికి ఎంపీ సి.ఎం. రమేష్ దుశ్శలువతో సత్కరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



## ఉత్తర నియోజకవర్గం నాయకులతో సమావేశం

### ముఖ్య అతిధిగా కె కె రాజు

**విశాఖపట్నం (జయ జయహే)**

వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ విశాఖపట్నం జిల్లా పార్టీ కార్యాలయంలో విశాఖపట్నం జిల్లా అధ్యక్షులు కె.కె రాజు విశాఖ ఉత్తర నియోజకవర్గ 53 వ వార్డు నాయకులు తో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా కె.కె రాజు . మాట్లాడుతూ వై.యస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు నియోజకవర్గంలో ఉన్న వార్డు మరియు సచివాలయం అనుబంధ విభాగం పార్టీ కమిటీలను త్వరగతిన పూర్తిచేసి,వార్డు సచివాలయం స్థాయిలో ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో 53 వ వార్డు కార్పొరేటర్ భర్కత్ అలీ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, వార్డు పరిశీలకులు యడ్ల శ్రీనివాసరెడ్డి, వార్డు నాయకులు, షేక్ బాబ్జి,రామలక్ష్మి, మరే ఝాన్సీ, సుశీల రామారావు, పాత్రుడు,హనుమంతు, ఆన్సర్ వల్లీ,బాలాజీ నబీ, సంపత్, నజీర్,సూర్య, భాను, స్వప్న, రాధా,భాను, భార్గవ్, సత్య రావు, పవన్,తదితరులు పాల్గొన్నారు

For a pure tomorrow.. జయజయహే



## మెరుగైన కంటి చూపు కోసం
# ఇవి తినాల్సిందే

నేటి ఆధునిక ప్రపంచంలో, మన కంటి ఆరోగ్యాన్ని దెబ్బతీసే డిజిటల్ తెరలు, కృత్రిమ లైటింగ్లతో మనం నిరంతరం కంటిని ఇబ్బందికి గురి చేస్తూనే ఉన్నాము. మన కళ్ళను జాగ్రత్తగా చూసుకోవడం, అవి ఉత్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందిస్తున్నట్లు చూసుకోవడం చాలా ముఖ్యం. మన కంటి ఆరోగ్యానికి తోడ్పడటానికి ఉత్తమ మార్గాలలో ఒకటి మన భోజనంలో కొన్ని ఆహారాలను చేర్చడం ద్వారా మెరుగైన కంటి దృష్టి, కంటి ఆరోగ్యాన్ని ప్రోత్సహించడంలో సహాయపడవచ్చు. క్యారెట్లు, బచ్చలికూర, సాల్మన్, బ్లూబెర్రీలు, బాదం వంటి ఆహారాలను చేర్చడం ద్వారా మీరు మీ కళ్ళకు ఉత్తమంగా పనిచేయడానికి అవసరమైన పోషకాలను అందించవచ్చు. మీ ఆహారం ద్వారా మీ కంటి ఆరోగ్యాన్ని జాగ్రత్తగా చూసుకోవడం అనేది రాబోయే సంవత్సరాల్లో మీ దృష్టికి మద్దతు ఇవ్వడానికి సరళమైన, ప్రభావవంతమైన మార్గం.

**క్యారెట్లు:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే.., క్యారెట్లు తరచుగా గుర్తుకు వచ్చే మొదటి ఆహారం. ఈ ప్రసిద్ధ మూల కూరగాయలలో బీటా %-% కెరోటిన్ పుష్కలంగా ఉంటుంది. ఇది విటమిన్ %ూ% ని పుష్కలంగా అందిస్తుంది. మంచి దృష్టి కోసం విటమిన్ %ూ% అవసరం. ఎందుకంటే, ఇది రెటీనా సరిగ్గా పనిచేయడానికి సహాయపడుతుంది. క్యారెట్లలో లూటిన్, జియాక్సాంటిన్ అనే రెండు యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇవి హానికరమైన నీలి కాంతి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.

**బచ్చలికూర:**
కంటి ఆరోగ్యం విషయానికి వస్తే బచ్చలికూర మరొక పవర్ హౌస్. ఈ ఆకుపచ్చ ఆకు లూటిన్, జియాక్సాంటిన్ తో నిండి ఉంటుంది. ఇది వయస్సు సంబంధిత మాక్యులర్ డిజెనరేషన్ నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. బచ్చలికూరలో విటమిన్ %జ% కూడా ఉంటుంది. ఇది యాంటీఆక్సిడెంట్, ఇది కంటిశుక్లం ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది.

**బ్లూబెర్రీస్:**
బ్లూబెర్రీస్ యాంటీఆక్సిడెంట్ లక్షణాలకు ప్రసిద్ధి చెందాయి. ఇవి ఆక్సీకరణ ఒత్తిడి నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి. ఈ రుచికరమైన బెర్రీలలో ఆంథోసైనిన్లు ఉంటాయి. ఇవి రాత్రి దృష్టిని మెరుగుపరచడానికి, కళ్ళను దెబ్బతినకుండా రక్షించడానికి సహాయపడే సమ్మేళనాలు. మీ ఆహారంలో బ్లూబెర్రీస్ ను చేర్చడం వల్ల కంటి ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడుతుంది.

**బాదం:**
బాదం విటమిన్ %ఞ% యొక్క గొప్ప మూలం. ఇది యాంటీఆక్సిడెంట్. ఇది వయస్సు సంబంధిత నష్టం నుండి కళ్ళను రక్షించడంలో సహాయపడుతుంది. విటమిన్ %ఞ% కంటిశుక్లం, మాక్యులర్ డిజెనరేషన్ ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. ఇవి దృష్టిని ప్రభావితం చేసే రెండు సాధారణ కంటి పరిస్థితులు. మీ ఆహారంలో బాదంపప్పును చేర్చడం మొత్తం కంటి ఆరోగ్యానికి సహాయపడుతుంది.



# రక్షణలో నేవీ కీలకం

## సముద్ర వాణిజ్యంలో సుస్థిరత.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వెల్లడి

## ఐఎన్ ఎస్ సుమేధ నుంచి ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ







**(విశాఖపట్నం - జయజయహే)**

దేశ తీర ప్రాంత ప్రయోజనాలు కాపాడటంలో నేవీది కీలకపాత్ర అని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తెలిపారు. సముద్ర వాణిజ్యంలో సైతం నేవీ సుస్థిరత తీసుకొచ్చిందని పేర్కొన్నారు. విశాఖపట్నం తీరం వేదికగా జరుగుతున్న ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ (ఐఎఫ్ఆర్) బుధవారం ప్రారంభమయ్యాయి. బుధవారం ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి ముర్ముతోపాటు గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని.. ఐఎన్ఎస్ సుమేధపై ప్రయాణించారు. నేవీ సిబ్బంది నుంచి రాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. వివిధ దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నేవీకి చెందిన 45 నౌకలు, కోస్ట్గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధనా నౌకలు ఫ్లీట్ రివ్యూలో పాల్గొన్నారు. ఆరు వరుసల్లో 71 యుద్ధ నౌకలు పరేడ్ నిర్వహించాయి.



## రాత్రిపూట పాలలో యాలకులు, పసుపు
# కలుపుకుని తాగితే ఇన్ని లాభాలా?





**పాలలో కాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను దృఢంగా తయారు చేయడంలో ఎంతో సహాయం పడుతుంది. అలాగే ఇందులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. దీని వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగు పనిచేస్తుంది. చిటికెడు యాలకుల పొడి, పసుపు కలపడం వల్ల ప్రయోజనాలు కలుగుతాయి. అందుకే వీటిని గోల్డెన్ మిల్క్గా అభివర్ణిస్తున్నారు.**

ఈ గోల్డెన్ మిల్క్తో ఒత్తిడిని తగ్గించుకోవచ్చు. ఇందులో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు తీవ్రమైన ఒత్తిడిని తగ్గిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. దీంతో పాటు పసుపు కలుపుకోవడం వల్ల ఇందులో ఉండే యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు శరీరానికి విశ్రాంతి అందజేస్తాయి. అంతేకాకుండా జలుబు దగ్గు వంటి సాధారణ సమస్యలను నుంచి ఉపశమనం కలుగుతుంది.

కఫంతో బాధపడేవారు ఈ యాలకుల పాలను తాగడం వల్ల సమస్య నుంచి విముక్తి పొందవచ్చు. అలాగే కీళ్ళనొప్పులు, కండరాల సమస్యలతో బాధపడే వారు కూడా ఈ పాలు తీసుకోవడం వల్ల ఎన్నో ఉపయోగలు ఉన్నాయి. గ్యాస్, ఉబ్బరం, అజీర్ణం వంటి సమస్యలతో బాధపడే వారికి పసుపు, యాలకులతో చేసిన పాలు తాగడం వల్ల ఈ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుంది.

ఏలకులు, పసుపు రెండూ నిద్రను మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఏలకులు ఒత్తిడిని తగ్గించే యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. అయితే పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి శరీరానికి విశ్రాంతినిస్తాయి. పాలలో యాలకులు తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు వంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఛాతీలో పేరుకుపోయిన కఫాన్ని తొలగించడంలో కూడా ఏలకులు ఉపయోగపడతాయి. పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉన్నాయి. ఇవి కీళ్ల, కండరాల నొప్పిని తగ్గించడంలో సహాయపడతాయి. ఏలకులు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అజీర్ణాన్ని నివారిస్తుంది.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com